వైద్య సిబ్బందికి తాఖీదులు

స్పందనకు వందనం

పులివెందుల (వేముల), న్యూస్‌టుడే: మండలంలోని మీదిపెంట్ల సచివాలయ విలేజ్ క్లీనిక్ సిబ్బందిలో ముగ్గురికి డీఎంహెచ్‌వో నాగరాజు షోకాజు నోటీసులు జారీ చేశారు. భూమయ్యగారిపల్లెలో ఔషధాలను రోగులకు పంపిణీ చేయకుండా సిబ్బంది నిర్లక్ష్యంగా ముళ్లపొదల్లో పడవేశారు. ఈ విషయమై ఈనాడులో శనివారం 'ముళ్లపొదల్లో ఔషధాలు' శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన డీఎంహెచ్‌వో సమస్యపై ఆరా తీయాలని వేముల ప్రాథమిక వైద్యాధికారిణి శరణ్యకు సూచించారు. దీంతో విలేజ్ క్లీనిక్‌లో పనిచేసే సిబ్బందిని పిలిపించి ఔషధాలను పరిశీలించగా కొన్ని గడువు ఉన్నవి కాగా, మరికొన్ని తీరినవిగా గుర్తించారు. విషయాన్ని వైద్యాధికారిణి డీఎంహెచ్‌వోకు నివేదించారు. గడువు ఉన్న ఔషధాలను వెంటనే ప్రజలకు అందించేలా చూడాలన్నారు. క్రమశిక్షణ చర్యల కింద ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తకు షోకాజు నోటీసులు జారీచేశారు.

కలెక్టర్ బదిలీపై ఉత్కంఠ

నిలుపుదలకు ముఖ్యమంత్రికి విన్నపం



ఈనాడు, కడప: కలెక్టర్ శివశంకర్ బదిలీపై ఉత్కంఠ నెలకొంది. బదిలీ అంటూ తప్పని సరైతే తదుపరి కలెక్టర్ ఎవరనే దానిపై చర్చ సాగుతోంది. ఈ నెల 16లోగా తెలంగాణ రాష్ట్రంలో రిపోర్టు చేయాలనే ఆదేశాలున్నాయి. మరోవైపు ఆంధ్రా క్యాడర్‌లోనే కొనసాగించాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు రెండు రోజుల కింద కలెక్టర్ విన్నవించుకున్నారు. సీఎం స్పందనను బట్టి బదిలీ భవిష్యత్తు ఆధారపడి ఉంది. బదిలీని నిలుపుదల చేయించుకునేందుకు కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించాలనే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో కొన్ని ఇబ్బందుల కారణంగా తెలంగాణ క్యాడర్‌కు బదిలీ కోసం శివశంకర్ బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. దరఖాస్తు తాజాగా పరిశీలనకు రాగా... ఆ మేరకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇప్పుడు రాష్ట్రం నుంచి తెలంగాణకు బదిలీ కావడానికి కలెక్టర్ సుముఖంగా లేనట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యమంత్రి జోక్యం చేసుకునే పక్షంలో బదిలీ ఆగే అవకాశాలున్నాయి. క్యాట్ నుంచి స్టే ఉత్తర్వులు పొందే ప్రయత్నాలు మరో వైపు జరుగుతున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం రిలీవ్ చేయని పక్షంలో గడువులోపు తెలంగాణలో చేరాల్సిన అవసరం ఉండదనే అభిప్రాయం అధికార వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితిలో కలెక్టర్ బదిలీపై ఉత్కంఠ నెలకొంది. త్వరలోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి.

అంబరాన్నంటిన దసరా సంబరాలు




ప్రొద్దుటూరులో తొట్టిమెరవణిలో కన్యకా పరమేశ్వరీ అమ్మవారు

ప్రొద్దుటూరులో కళాకారుల బేతాళ నృత్యాలు

దసరా అంటేనే రాయలసీమలో గుర్తుకు వచ్చేది ప్రొద్దుటూరు, జిల్లాలో పేరెన్నికగన్నది కడప విజయదుర్గ అమ్మవారి ఆలయాలు.. ఇక్కడ దసరా ఉత్సవాలను తిలకించాలంటే ఎవరికైనా రెండు కళ్లు చాలవు. వివిధ వేషధారణలు, బేతాళ నృత్యాలు, ఆకాశంలో తారాజువ్వలు, టపాసులు... సూర్యుడు వెలుతురు ఇలా ఒకటేమిటి వైభవమంతా ఇక్కడే అన్నట్లుగా వేడుకలు సాగాయి. ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో వేడుకగా తొట్టి మెరవణి (గ్రామోత్సవం) నిర్వహించారు. వసంతోత్సవంతో కార్యక్రమాలు ముగిశాయి. కడపలో విజయదుర్గ ఆలయంలో భారీ జనసమూహం మధ్య అమ్మవారు గ్రామోత్సవంగా బయలుదేరి ఆదివారం ఉదయానికి ఆలయం చేరుకున్నారు. ఈ సందర్భంగా సాగిన రథోత్సవం ప్రత్యేకాకర్షణగా నిలిచింది. ఆయా కార్యక్రమాల చిత్రాలివి. - న్యూస్‌టుడే, కడప, ప్రొద్దుటూరు బృందం



ఉత్సవాల సందర్భంగా కళాకారుల నృత్య ప్రదర్శనలు



కడపలో ఆకట్టుకున్న కళాకారుల విచిత్ర వేషధారణ

విజయ దుర్గమ్మ రథాన్ని లాగుతున్న మహిళలు

కడప అమ్మవారిశాలలో శమీ దర్శనంలో వాసవీ మాత

కశ్మీర్ కాదు రామసముద్రం యాపిల్



యాపిల్... అంటేనే మనకు గుర్తుకు వచ్చేది కశ్మీర్, సిమ్లా కానీ అదే పంట జిల్లాలోని రామసముద్రంలో పడుతోందని తెలుసా! హిమాచల్‌ప్రదేశ్ నుంచి తెచ్చిన హెచ్ఆర్ఎంఎన్-99 హైబ్రిడ్ రకం యాపిల్ మిట్టఎంబాడి గ్రామానికి చెందిన రైతు లోకేష్‌రెడ్డి సేంద్రియ పద్ధతిలోనే సాగు చేశారు. సాగు వ్యయం భరిస్తే చాలు పాతికేళ్ల కాసుల పంటే. కేవలం తోట నిర్వహణకు మాత్రమే వ్యయం చేయాల్సి వుంటుంది. నాలుగు ఎకరాలకు మొదటి ఏడాదిలో రూ.5 లక్షలు వ్యయం చేస్తే రెండో ఏడాది వచ్చిన దిగుబడితోనే పెట్టుబడి వచ్చేసింది. దిగుబడిలో నాణ్యత, రంగు, రుచి బాగా ఉండడంతో తోట వద్దకే వచ్చి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. కిలో రూ.100 నుంచి రూ.150 వరకు ధర పలుకుతోంది. రామసముద్రం యాపిల్ పండ్లు మదనపల్లె, పుంగనూరు, పలమనేరు మార్కెట్లకు తరలుతున్నాయి. - న్యూస్‌టుడే, రామసముద్రం

టమాట రైతే రాజు



రూ.25 నుంచి రూ.90కు ఎగబాకిన ధర

అన్‌సీజన్‌లోనూ లాభాలు తెచ్చిపెట్టిన పంట

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : సాగులో ఎదురయ్యే సమస్యలను అధిగమించి ముందడుగు వేసిన టమాట రైతులకు లాభాలపంట పడింది. అన్ సీజన్‌లోనూ గిట్టుబాటు ధరకంటే మెండుగా ధర పలకడంతో రైతుల ముఖాల్లో సంతోషం వెల్లివిరుస్తోంది. ప్రతికూల వాతావరణంలోనూ రైతులు టమాట సాగు చేశారు. పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. వేలు ఖర్చు చేస్తే లక్షల్లో లాభాలు చూడగలుగుతున్నారు.

మన పంట దేశవ్యాప్తంగా వంట

- మదనపల్లె మార్కెట్ యార్డులో మూడు నెలల వ్యవధిలో కిలో టమాట రూ.25 నుంచి రూ.90కు ఎగబాకింది. అంతకు ముందు మే నెలలో మాత్రమే ధరలు కాస్త అటు ఇటుగా పలికాయి. ఆ తర్వాత నెల నుంచి రూ.20 తగ్గకుండా ధరలు నిలకడగా ఉన్నాయి. దీంతో రైతు కూడా నష్టాల నుంచి గట్టెక్కి లాభాల బాట పట్టారు.
- జూన్ నెలలో రూ.40 నుంచి రూ.88లకు వరకు ఎగబాకింది. జులైలో ధర కాస్త తగ్గుముఖం పట్టినా, రైతుకు మాత్రం గిట్టుబాటు ధర లభించింది. ఆగస్టులో రూ.20 నుంచి రూ.32 వరకు ధరపలికింది. సెప్టెంబర్ మొదటి రెండు వారాల్లో నామమాత్రంగా పలికిన ధర ఆ తర్వాత పైకి ఎగబాకి రూ.64కు చేరింది. అక్టోబర్ నెలలో రూ.64 నుంచి రూ.90లకు పెరిగింది.

అక్టోబర్ నెలలో ఇలా

తేదీ	దిగుబడి (టన్నులు)	కనిష్ఠ ధర (10 కేజీలులకు రూపాయల్లో)	గరిష్ఠ ధర (10 కేజీలులకు రూపాయల్లో)
01	126	540	640
02	84	820	900
03	96	820	900
04	106	820	880
05	98	820	880

మేలో కిలో : రూ.20
జూన్ : రూ.40 నుంచి రూ.80
జులై : ధరలు తగ్గాయి
ఆగస్టు : రూ.20 - రూ.32
సెప్టెంబరు : రూ.64
అక్టోబరు : రూ.64 - రూ.90

మూడు నెలల్లో మార్కెట్‌కు వచ్చిన పంట (మెట్రిక్ టన్నుల్లో)
ఆగస్టు : 15,178
సెప్టెంబర్ : 4,024
అక్టోబరు : 1,267

ఏఏ రాష్ట్రాలకు వెళ్లిందంటే...


ఛత్తీస్‌గఢ్, గుజరాత్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలకు టమాట ఎగుమతి అవుతోంది. ప్రస్తుతం తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ నగరాలకు ఎగుమతి చేస్తున్నారు.

పొంచి ఉన్న తుపాను!

- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

ఈనాడు, కడప: తుపాను అన్నమయ్య, వైయస్ఆర్ జిల్లాల వైపు దూసుకురానుంది. ఈ మేరకు విపత్తుల నిర్వహణ విభాగం కలెక్టర్లను అప్రమత్తం చేసింది. దీంతో జిల్లా స్థాయిలో పలు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో సోమవారం నాటికి అల్పపీడనం ఏర్పడే సూచనలు ఉన్నాయనే సమాచారం అందింది. ఇది తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉన్నట్లు హెచ్చరించింది. అల్పపీడనం ప్రభావంతో అన్నమయ్య, వైయస్ఆర్ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉంది. సోమవారం నుంచి మూడు రోజుల పాటు ప్రభావం ఉండనున్నట్లు అందిన సమాచారంతో సోమవారం రాయచోటిలో జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ ప్రకటన జారీ చేశారు. అర్జీదారులు కలెక్టర్ కార్యాలయానికి రావద్దని సూచించారు. వైయస్ఆర్ జిల్లాలో రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశారు. కలెక్టర్ కార్యాలయంలో పాటు కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవో కార్యాలయాల్లో కంట్రోల్ రూంలు చేస్తూ విపత్కర పరిస్థితుల సమాచారాన్ని చేరవేసి సాయం పొందడానికి వీలుగా ఫోన్ నంబర్లు విడుదల చేశారు. కలెక్టర్ కార్యాలయం 08562-246344, కడప ఆర్డీవో 8985429256, జమ్మలమడుగు 9618804882, బద్వేలు 917013323862, పులివెందుల 8520082425, 9542299885 ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచారు. పురపాలక, వైద్య, ఆరోగ్యం, విద్యుత్తు, జలవనరులశాఖ, పంచాయతీరాజ్, అగ్నిమాపకశాఖలు అప్రమత్తంగా ఉండాలంటూ.. అధికారులందరూ పని చేసే స్థానాల్లో అందుబాటులో ఉండాలని కలెక్టరు హెచ్చరించారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



మారుతీనగర్, ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: తిరుమల తొలిగడప దేవుని కడప శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయం, ఆంధ్రా భద్రాద్రి ఒంటిమిట్ట కోదండ రామాలయంలో శ్రవణా నక్షత్రం, విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిగాయి. దేవుడిగడపలో లక్ష్మీ వెంకటేశ్వరస్వామి వారి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. ఒంటిమిట్టలో స్వామివారిని పట్టువస్త్రాలు, పుష్పమాలికలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. రామయ్య క్షేత్రం నుంచి శమీ దర్శనం కోసం రఘురాముడు వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ తరలివెళ్లారు. అనంతరం గ్రామోత్సవం కనులపండువగా సాగింది.

సోమశిల... విహంగాల కళ



సోమశిల వెనుక జలాల ప్రాంతం ప్రకృతి రమణీయతకు మరో ప్రపంచం. విదేశీ విహంగాల శోభ.. వలస పక్షుల కిలకిలారావాలు.. కువకువల అందాల అతిథులతో ఆ ప్రాంతం సందడి చేస్తోంది. ఉమ్మడి కడప-నెల్లూరు జిల్లాల్లోని వెనుక జలాలు సువిశాలమైన సురక్షిత ప్రాంతం కావడంతో ఏటా అక్టోబరు ప్రారంభం నుంచి సైబీరియా పక్షులు ఇక్కడికి విడిది కోసం వస్తుంటాయి. ఇక్కడ సంతానోత్పతికి అనుకూలమైన వాతావరణం ఉండటంతో దశాబ్దం కాలంగా విదేశీ విహంగాల పక్షుల సంఖ్య పెరుగుతోంది. ఆ చిత్రమే ఇది. - న్యూస్‌టుడే, ఒంటిమిట్ట

బియ్యం పత్రం రూపు మారుతోంది

కడప, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేద, మధ్య తరగతి వర్గాలకు కొత్త బియ్యం పత్రాలివ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు ముమ్మరంగా కసరత్తు సాగుతోంది. మార్గదర్శకాల తయారీలో ఉన్నతాధికారులు నిమగ్నమయ్యారు. గత వైకాపా పాలనలో మాజీ సీఎం వైఎస్ఆర్‌తో పాటు అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రాలతో పాటు ఆ పార్టీ రంగులతో ముద్రించిన పత్రాలిచ్చారు. వీటి స్థానంలో నూతనంగా తయారు చేయించి ఇవ్వాలని ఇటీవల ఉన్నత స్థాయిలో చర్చించారు. జిల్లాలో చౌక ధరల దుకాణాలు 1,239 ఉన్నాయి. మొత్తం బియ్యం కార్డులు 5,86,352 ఉండగా అందులో సభ్యులు 17,62,579 మంది ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆహార భద్రత పథకంలో అంత్యోదయ అన్న యోజనలో 36,017 పత్రాలు (99,100 యూనిట్లు), బియ్యం కార్డులు 4,93,908 (15,33,438 యూనిట్లు) ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ కోటాలో ఏఏవై 591 (848 యూనిట్లు), రేషన్ కార్డులు 55,386 (1,29,193 యూనిట్లు) అందజేశారు. గత అయిదేళ్ల (2019-2024) జగన్‌రెడ్డి జమానాలో కార్డుదారులకు అవస్థలు తప్పలేదు.

పోలీసు సంక్షేమ సొసైటీలో నిధుల గోల్‌మాల్?

కడప, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు సంక్షేమ సొసైటీలో కొంతమంది ఉద్యోగులు నిధుల గోల్‌మాల్‌కు పాల్పడినట్లు తెలుస్తోంది. సుమారు రూ.30 లక్షలకు పైగా చేతివాటాన్ని ప్రదర్శించినట్లు సమాచారం. దీనిపై ఓ డీఎస్పీ స్థాయి అధికారి విచారణ చేస్తున్నట్లు తెలిసింది. సొసైటీలో సభ్యులుగా ఉన్న వారు ప్రతి నెలా రూ.1000 కడతారు. ఏదైనా ఇబ్బందులున్నా, మరే ఇతర కారణాలతో డబ్బులు అవసరమైనవారు సొసైటీ నుంచి తీసుకుంటారు. ఈ వ్యవహారంలోనే సొమ్ము పక్కదారి పట్టినట్లు చర్చ నడుస్తోంది. పోలీసు ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపడితే అసలు విషయాలు వెల్లడయ్యే అవకాశాలున్నాయి.

నేడు మద్యం దుకాణాలకు లాటరీ

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే : జిల్లాలో 2024-26 ఏడాదికి సంబంధించి 139 మద్యం దుకాణాలకు సోమవారం కడప జడ్పీ సమావేశ మందిరంలో లాటరీ నిర్వహించనున్నారు. దరఖాస్తు చేసుకున్న వారంతా ఉదయం 7.30 గంటల కల్లా జడ్పీ కార్యాలయానికి రావాల్సి ఉంటుంది. ఆలస్యమైనా, రాకపోయినా వారి దరఖాస్తును రద్దు చేస్తామని కడప ఎక్సైజ్ పర్యవేక్షణాధికారి రవికుమార్ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ... మొత్తం 3,257 దరఖాస్తులు వచ్చాయని, దాఖలు చేసిన వారందరికీ ఎంట్రీ పాసు ఇచ్చామని, వారిని మాత్రమే లోపలకు అనుమతిస్తామన్నారు. ఉదయం 8 గంటలకు కలెక్టరు శివశంకర్ లాటరీ ప్రక్రియను ప్రారంభించి దుకాణాలను కేటాయిస్తారని వెల్లడించారు. వాటిని దక్కించుకున్న వారు వెంటనే మొత్తం ఫీజులో ఆరో వంతు చెల్లించాలని, ఒక వేళ ఏదైనా కారణంతో చెల్లించకపోతే రెండో వ్యక్తికి అవకాశం వస్తుందన్నారు. 16 నుంచి కొత్త మద్యం దుకాణాలు ప్రారంభించుకోవచ్చని చెప్పారు.

పోలీసు అధికారుల పరిశీలన: లాటరీ ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు భారీ ఎత్తున పోలీసు బలగాలను మోహరించారు. సుమారు 600 నుంచి 700 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఐలు రామకృష్ణ, జావెద్, ఎస్బీ సీఐ వెంకటకుమార్ ఆదివారం జడ్పీ ఆవరణాన్ని పరిశీలించారు. ఎక్కడెక్కడ బందోబస్తు ఏర్పాటు చేయాలి, వాహనాల పార్కింగ్ తదితర వాటిని పరిశీలించారు. మూడంచెల బందోబస్తు విధానం అమల్లో ఉంటుందని పోలీసులు తెలిపారు.

పల్లెలు మురవాలి... ప్రగతి విరియాలి

- గ్రామీణ రహదారులకు మహర్దశ
- నేటి నుంచి 21 వరకు పల్లె పండగ
- తొలి విడతలో 976 పనులకు పచ్చజెండా



లింగాల ఎస్సీ కాలనీలో సిమెంటు రహదారి నిర్మించాల్సిన ప్రాంతం

కడప, లింగాల, న్యూస్‌టుడే: దేశానికి పల్లెసీమలే పట్టుగొమ్మలు... గత అయిదేళ్ల వైకాపా పాలనలో గ్రామాల అభివృద్ధిని విస్మరించారు. మౌలిక వసతులపై అంతులేని నిర్లక్ష్యం చేశారు. జగన్ జమానాలో గ్రామీణులు అసౌకర్యాలతో అవస్థలు పడ్డారు. గత సర్కారు నిర్వాకంతో పల్లెవాసులు పడరాని పాట్లు పడినా పట్టించుకునే వారు కరవయ్యారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ రహదారులకు మహర్దశ తీసుకురావాలని ముందుకొచ్చారు. నరేగా పద్దుతో మౌలిక సదుపాయాలు కల్పించాలని కీలక నిర్ణయం తీసుకొన్నారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో చేయాల్సిన పనులను గుర్తించి ప్రతిపాదనలు తెప్పించారు. జిల్లాస్థాయిలో పరిశీలించి పచ్చజెండా ఊపారు. ఈ నెల 14-21 వరకు పల్లె పండగ కార్యక్రమాన్ని నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో నూతనంగా చేపట్టనున్న పనులకు శంకుస్థాపనలు, భూమి పూజలు చేయాలని అధికార యంత్రాంగం దృష్టి సారించింది.

- జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలని 976 పనులకు అనుమతిచ్చారు. సీసీ, తారు, డబ్ల్యూబీఎం రహదారులు, ప్రహరీల నిర్మాణాలు 167.10 కి.మీ చేయాల్సి ఉంది. వీటి అంచనా విలువ రూ.71.14 కోట్లు. రాజంపేట శాసనసభ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఒంటిమిట్ట, సిద్దవటం మండలాల్లో ఇంకా అనుమతి ఇవ్వలేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నేతృత్వంలో ఈ ఏడాది ఆగస్టు 23న పంచాయతీల్లో గ్రామసభలను నిర్వహించారు. ప్రజల నుంచి అభ్యర్థనలు స్వీకరించారు. ప్రాధాన్యం క్రమంలో తొలివిడతలో ఎలాంటి పనులు చేయాలో గుర్తించారు. ఈ మేరకు జనం సమక్షంలో చర్చించి చేయాల్సిన పనులకు పంచాయతీల్లో తీర్మానం చేశారు. ఆనక అనుమతి ఇవ్వాలని ప్రతిపాదనలు పంపించారు.

డిసెంబరులోపు పూర్తి చేస్తాం

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులను ఈనెల 14 నుంచి శ్రీకారం చుట్టాలని ప్రణాళికను రూపొందించాం. ఈ ఏడాది డిసెంబరు ఆఖరి నాటికి అన్ని పనులు పూర్తి చేసేలా ప్రణాళికను రూపొందించాం. క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేయాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించాం. నాణ్యతపై రాజీపడం. ఒంటిమిట్ట, సిద్దవటం మండలాల్లోనూ చేపట్టనున్న పనులకు త్వరలో అనుమతిస్తాం.
- శ్రీనివాసులురెడ్డి, ఎస్ఈ, పంచాయతీరాజ్ శాఖ, కడప

2డీ ఎకో... ఎప్పటికో?

- టెక్నీషియన్ సెలవుతో విభాగం మూత
- రిమ్స్‌లో గుండె సంబంధిత రోగుల ఇక్కట్లు

న్యూస్‌టుడే, సర్వజన ఆసుపత్రి




రిమ్స్‌లోని 2డీ ఎకో విభాగానికి తాళం వేసిన సిబ్బంది

జిల్లా సర్వజన ఆసుపత్రికి రోజూ ఓపీకి వేల సంఖ్యలో రోగులు వస్తుంటారు. దూరప్రాంతాల నుంచి వందల రూపాయలు ఛార్జీలు పెట్టుకుని వైద్యం కోసం వచ్చే పేదవారు కొన్ని విభాగాల్లో సిబ్బంది కొరతతో చికిత్స అందకుండానే ఉసూరుమంటూ వెనుదిరిగి వెళ్లాల్సి వస్తోంది. గుండె వ్యాధులకు సంబంధించి రోగులకు ఎవరికైనా మొదట ఈసీజీ తీస్తారు. అందులో సమస్య ఉన్నట్లు తేలితే వెంటనే వైద్యులు గుండె పనితీరు తెలుసుకునేందుకు 2డీ ఎకో పరీక్ష రాస్తారు. ఇది బయట చేయాలంటే రూ.2,500 నుంచి రూ.3,000 వరకు వసూలు చేస్తారు. అందుకే చాలామంది రిమ్స్‌కే వస్తారు.

సెలవు పెడితే మూతే : ఓపీ, ఐపీ రెండు విభాగాలకు సంబంధించి రిమ్స్‌లో ఒక్కటే 2డీ ఎకో యంత్రం ఉంది. ఇక్కడ సిబ్బంది కూడా ఒక్కరే ఉన్నారు. దీంతో అతను సెలవు పెడితే ల్యాబ్ మూసేయాల్సిన పరిస్థితి. దీంతో వైద్యులు పరీక్ష చేయమని రాసినా, అక్కడ ఎవరూ లేకపోవడంతో రోగులు వెనక్కు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మళ్లీ అతను ఎప్పుడు వస్తాడో తెలుసుకుని రావాలి. అప్పటికి మరింత మంది ఉంటారు. దీంతో అటు పరీక్ష చేయక, ఇటు చికిత్స అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

ఉసూరుమంటూ వెళుతున్నాం



మాది రాజంపేట పక్కన మూగవారి పల్లె. గుండె దడ, ఆయాసంగా ఉంటే మా కుమార్తెను తోడుగా తీసుకుని వచ్చాను. వైద్యులు ఈసీజీ తీసి గుండె పనితీరు సరిగా లేదని, 2డీ ఎకో తీసుకురమ్మని చీటీ రాసి ఇచ్చారు. అక్కడకు వెళితే తాళం వేసి ఉంది. పక్కనున్న వారిని అడిగితే టెక్నీషియన్ సెలవులో ఉన్నారని, అత్యవసరమైతే ప్రైవేట్‌కు వెళ్లమని చెప్పారు. బస్సు, ఆటో ఛార్జీలు, భోజనం ఇతర ఖర్చులు కలిపి రూ.1000 ఖర్చయింది. ఇప్పుడు ప్రైవేటుకు వెళితే వేలకు వేలు అవుతుంది. ఇంక చేసేది లేక ఇంటికి వెళ్లి పోతున్నాం.
- రామయ్య, రోగి, రాజంపేట

సెలవులో ఉన్నమాట వాస్తవమే

టెక్నీషియన్ సెలవులో ఉన్నమాట వాస్తవమే. ఇంకో వ్యక్తికి శిక్షణ ఇచ్చాం. అతను పూర్తిగా నేర్చుకోలేదు. అందుకే ఇక్కడ 2డీ ఎకో తీయడం లేదు. అత్యవసరమైతే సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రికి వెళితే అక్కడ తీస్తారు.
- డాక్టర్ రాజేశ్వరి, ఆర్ఎంవో, రిమ్స్

నాణ్యత మరిచిన నేతలు...
నెర్రెలు చీలిన దారులు

ప్రొద్దుటూరు మండలం చెన్నమరాజుపల్లె పంచాయతీ పరిధిలోని నాగాయపల్లె, పెద్దశెట్టిపల్లె పంచాయతీ కొత్త పేట గ్రామానికెళ్లే సిమెంట్ రోడ్లు ధ్వంసమయ్యాయి. నెర్రెలిచ్చి... గుంతలు పడ్డాయి. సైకిల్, ద్విచక్ర వాహనాల టైర్లు నెర్రెల్లో చిక్కుకొని అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో బడికెళ్లే విద్యార్థులు, పనుల నిమిత్తం పట్టణానికెళ్లే వారు కింద పడి గాయాల పాలవుతున్నారు. సైకిల్ చక్రం నెర్రెల్లో పడటంతో కళాశాలకెళ్లే ఓ విద్యార్థిని ఇటీవల కింద పడి రక్తగాయాలకు గురైనట్లు స్థానికులు చెబుతున్నారు. గత అయిదేళ్లుగా ఆ గ్రామాల ప్రజల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పట్టించుకునే నాథుడే కనిపించలేదని వాపోతున్నారు. ఈ సమస్యలపై ప్రొద్దుటూరు పంచాయతీ రాజ్ శాఖ ఏఈ గణేష్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా నాగాయపల్లె, కొత్త పేట గ్రామాలకెళ్లే పరిస్థితిని పరిశీలించి, నెర్రెలు పడిన రహదారులకు తాత్కాలిక మరమ్మతులు చేయిస్తామన్నారు. - ఈనాడు, కడప, - న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు



నెర్రెలు పడిన కొత్తపేట గ్రామ దారి

అమ్మవారి ఊరేగింపులో అపశ్రుతి

* విద్యుదాఘాతంతో ఒకరి మృతి
* అయిదుగురికి తీవ్ర గాయాలు

న్యూస్‌టుడే, కడప నేరవార్తలు

దసరా ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన అమ్మవారి ఊరేగింపులో అపశ్రుతి చోటు చేసుకుంది. విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రుల్లో రెండున్నరేళ్ల బాలుడు ఉన్నాడు. పండగ సందర్భంగా కడప గడ్డిబజార్‌లోని బాలాజీ దేవాలయంలో దేవీ నవరాత్రులు నిర్వహించారు. విద్యుత్తు దీపాల అలంకరణ పనులకు పెండ్లిమర్రి మండలం గంగన్నపల్లెకు చెందిన మేకల రామయ్య(48) వచ్చారు. ఈయనతో పాటు పుష్పగిరికి చెందిన వెంకటరమణ, శ్రీనివాసులు కూడా ఉన్నారు. విజయదశమి సందర్భంగా శనివారం రాత్రి ఆలయం నుంచి అమ్మవారి విగ్రహాన్ని ఎద్దులబండిపై ఊరేగించారు. బెల్లంమండి వీధి వద్దకు రాగానే విద్యుత్తు తీగలు పైభాగాన ఉన్న ఇనుప కలశానికి తాకడంతో బండికి విద్యుత్తు సరఫరా అయింది. దీంతో సమీపంలోనే ఉన్న మేకల రామయ్య(48), వెంకటరమణ, శ్రీనివాసులుకు గాయాలయ్యాయి. అక్కడ ఉన్న అదే వీధికి చెందిన రంగరాజ్‌కుమార్, రెండున్నరేళ్ల బాలుడూ గాయపడ్డారు. వెంటనే వీరందరినీ చికిత్స నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. రామయ్య చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ప్రమాదంలో రూ.6 లక్షలు విలువ చేసే ఎద్దు కూడా మృత్యువాత పడింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

561 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : మండలంలోని కొంపల్లె చెక్‌పోస్టు వద్ద 561 క్వింటాళ్ల బియ్యాన్ని తరలిస్తున్న లారీని సీకేదిన్నె పోలీసులు పట్టుకున్నారు. చెన్నూరు మండలం నుంచి బియ్యాన్ని చెన్నైకు తరలిస్తుండగా లారీని స్వాధీనం చేసుకున్నారు. బిల్లులు స్వాధీనం చేసుకుని ఇవి రేషన్ బియ్యమా, కాదా అనే దానిపై స్పష్టతకు తహసీల్దారుకు పంపారు. అక్కడకు నుంచి వచ్చిన సమాచారం మేరకు తాము చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

యువతిని కాపాడిన రైల్వే పోలీసులు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: ఆత్మహత్య చేసుకోవడానికి రైల్వేస్టేషన్‌కు వచ్చిన యువతిని రైల్వే రక్షక దళం పోలీసులు కాపాడారు. ఘటనకు సంబంధించిన వివరాలను కడప రైల్వే రక్షక దళం సర్కిల్ ఇన్‌స్పెక్టరు శ్రీనివాసులు వెల్లడించారు. కడప నగరం చెమ్మామియాపేటకు చెందిన యువతి ఎంబీఏ పూర్తి చేసింది. తల్లిదండ్రులతో ఆమె గొడవపడి ఆత్మహత్య చేసుకోవడానికి కడప రైల్వేస్టేషన్‌కు వచ్చి ప్లాట్‌ఫాంపై కూర్చుంది. ఆమె ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో కడప రైల్వే రక్షక దళం పోలీసులు ఆమెను విచారించగా అసలు విషయం వెల్లడైంది. అనంతరం కౌన్సెలింగ్ ఇచ్చి యువతిని మేనమామకు అప్పగించారు. యువతిని కాపాడిన ఆర్‌పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్‌రెడ్డి, కానిస్టేబుల్ సునీతలను సీఐ శ్రీనివాసులు అభినందించారు.

అత్యున్నత విద్య అభ్యసించేలా కృషి



ఐఆర్‌ఎస్ సమీర్‌ను సన్మానిస్తున్న దూదేకుల సంఘ రాష్ట్ర నాయకులు పగడాల సిద్దయ్య, తదితరులు

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: నూర్‌బాషా దూదేకుల సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులను సివిల్స్, గ్రూప్-1, 2 తరహా విద్య అభ్యసించి ఉన్నత ఉద్యోగాలు పొందేలా కృషి చేయడమే రాష్ట్ర నూర్‌బాషా దూదేకుల ఉద్యోగుల సంఘం లక్ష్యమని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పగడాల సిద్దయ్య తెలిపారు. ఆదివారం స్థానిక గౌతమి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో దూదేకుల మేధావులు, ఉద్యోగులు, నాయకులకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాంటి మేధావులను ఏకం చేసే దిశగా అడుగులు వేస్తామన్నారు. ఐఆర్‌ఎస్ సాధించిన ఆదోనివాసి సమీర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధినేత నాగూర్, ఉద్యోగు సంఘ నాయకులు బాజీ కన్నయ్య, రాష్ట్ర అధ్యక్షుడు పీరు మహమ్మద్, ప్రధాన కార్యదర్శి సలీం కోశాధికారి దస్తగిరి, డాక్టర్ బాబన్ నూరు, మొహమ్మద్ లాల్ నజీర్, రాయలసీమ ప్రాంత వర్కింగ్ అధ్యక్షుడు ఉత్తరాంధ్ర అధ్యక్షుడు ఖాదర్‌బాషా, విశ్రాంత ఎస్పీ కిషోర్‌బాబు, షేక్షావలి, విశ్రాంత డీఎస్పీ మహబూబ్‌బాషా, హుస్సేన్‌పీరా, నాగరాజు, అనంతపురం మాజీ జడ్పీ ఛైర్మన్, దివంగత చమన్‌సాబ్ కుమారుడు డాక్టర్ ఉమర్‌ముక్తార్, ఉద్యోగులు, నాయకులు పాల్గొన్నారు.

అపార్... అన్ని వివరాలు ఒకేచోట!



విద్యార్థులకు డిజిటల్ కార్డులు ● ప్రారంభమైన కసరత్తు

నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రతి విద్యార్థికి అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) అందించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆధార్ తరహాలో వన్ నేషన్ - వన్ స్టూడెంట్ నినాదంలో భాగంగా కేంద్ర విద్యా శాఖ దీనికి శ్రీకారం చుట్టింది. కేజీ నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులకు గుర్తింపు సంఖ్యను కేటాయించనుంది. దీనికి సంబంధించిన కార్యచరణ ప్రారంభమైంది. - న్యూస్‌టుడే, వైవీయూ, జమ్మలమడుగు

అవస్థలు తప్పేలా...

పక్క రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు జిల్లాలోని యోగి వేమన విశ్వవిద్యాలయం, డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో డిగ్రీ లేదా పీజీ కోర్సుల్లో చేరారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇక్కడి విద్యార్థులకు మాత్రమే ఉపకార వేతనాలు అందిస్తారు. దీంతో మిగతా వారు తమ సొంత రాష్ట్రాల్లో ఉపకార వేతనాలకు దరఖాస్తు చేయగా, ఆంధ్రప్రదేశ్‌లో చదువుతున్నట్లు వివరాలు అందుకు సంబంధించి దస్త్రాలు సమర్పించాలని, రిజిస్ట్రార్ సంతకంతో ధ్రువీకరణ ఉంటేనే ఇస్తామని చెప్పారు. ఆ విద్యార్థులు ఇక్కడి నుంచి అక్కడకు, అక్కడ నుంచి ఇక్కడకు పలుమార్లు తిరగాల్సి వచ్చింది. దీంతో విలువైన సమయం, సొమ్ము, తరగతులు వృథా అయ్యాయి. ఇపుడు కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన అపార్‌తో విద్యార్థులకు ఇకపై ఇలాంటి కష్టాలు ఉండవని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం పాఠశాల విద్యార్థులకు యూడైస్ వెబ్‌సైట్‌లో ప్రతి విద్యార్థికి పెన్ (పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబరు) ఉంది. దీని ఆధారంగానే విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడం, టీసీలు జారీచేయడం చేస్తున్నారు. ఇకపై ఆపార్‌తోనే అన్ని కార్యకలాపాలు నిర్వహిస్తారు.

స్కాన్ చేస్తే తెలిసేలా...

ఆపార్ అంటే ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ. దీనినే వన్ నేషన్.. వన్ స్టూడెంట్ ఐడీ కార్డు అని కూడా పిలుస్తారు. దీనిలో పేరు, పుట్టిన తేదీ, జెండర్, ఫొటో, క్యూఆర్ కోడ్, 12 అంకెల గుర్తింపు నంబరు విద్యార్థి మార్కులు, గ్రేడు, ఉపకార వేతన వివరాలు, క్రీడల్లో సాధించిన విజయాలతో పాటు వ్యక్తిగత, విద్యా సంబంధిత వివరాలు అపార్ డిజిటల్ కార్డులో భద్రంగా ఉంటాయి. స్కాన్ చేస్తే మొత్తం అన్నీ వెంటనే తెలుసుకునేలా దీనిని రూపొందించారు. తొలుత 9-12 తరగతుల వారికి ఇవ్వడానికి సన్నాహాలు చేస్తున్నారు. 9, 10 తరగతులు చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో చదువుకుంటున్న విద్యార్థులకు జారీ చేసేందుకు మార్గదర్శకాలు జారీ చేశారు.



ఎక్కడైనా ప్రవేశాలు..

కేంద్ర ప్రభుత్వం జారీచేసే గుర్తింపు సంఖ్య ఆధారంగా అపార్ కార్డులో విద్యార్థి బ్యాంకు ఖాతా, డిజి లాకర్‌తో అనుసంధానమై ఉంటుంది. ఈ కార్డులను జారీచేసే ముందు కేంద్ర ప్రభుత్వ అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ (ఏబీసీ)ని ప్రారంభించింది. డిజి లాకర్ ద్వారా వివరాలు నమోదు చేస్తే విద్యార్థి పేరుతో అపార్ కార్డు వస్తుంది. దీనిని నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీని ద్వారా వివిధ విద్యా సంస్థల్లో ప్రవేశాలు, ప్రవేశ పరీక్షల్లో వివరాలు నమోదు, ధ్రువీకరణ తదితర పనులన్నీ సులువుగా పూర్తవుతాయి. ఇకపై ఉపకారల వేతనాల మంజూరు, ఉద్యోగాల భర్తీ, ఇతర సందర్భాల్లో ఇదే కీలకం కానుంది. ఈ విధానంపై ఇప్పటికే అధికారులకు అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థికీ దీనిని ఇవ్వడానికి కసరత్తు ముమ్మరం చేశారు.

ప్రాథమిక పాఠశాలలు	ప్రాథమికోన్నత పాఠశాలలు	ఉన్నత పాఠశాలలు	1 నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు	9 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు	ఇంటర్ విద్యార్థుల సంఖ్య
2,542	295	391	1.38 లక్షల మంది	39,800	41,900

నమోదు ప్రక్రియ తప్పనిసరి : అపార్ నమోదు ప్రక్రియ 9, 10 తరగతి విద్యార్థులు తప్పని సరిగా చేయించుకోవాలి. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలు జారీ చేశాం. **-అనురాధ, డీఈవో, వైఎస్‌ఆర్ జిల్లా**

అగ్రిసెట్‌లో మెరిసిన నవ్యశ్రీ



ఖాజీపేట, కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: అగ్రికల్చర్ బీఎస్సీలో ప్రవేశాలకు నిర్వహించిన అగ్రిసెట్-2024లో ఖాజీపేట మండలంలోని నాగసానిపల్లెకు చెందిన శీర్ల రాజు, శంకరమ్మల కుమార్తె **ఎస్.నవ్యశ్రీ** (హాల్‌టికెట్ నెం. 43343011189) రాష్ట్ర స్థాయిలో 19వ ర్యాంకు సాధించారు. తిరుపతిలోని ఎస్వీ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అగ్రికల్చర్ డిప్లొమో చదివానని, వ్యవసాయ శాస్త్రవేత్తను కావాలన్నది తన ధ్యేయమని నవ్యశ్రీ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ర్యాంకు సాధించడంపై కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

పోలీసు కార్యాలయంలో ఆయుధ పూజ

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: విజయదశమి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఎస్పీ హర్షవర్ధన్‌రాజు దంపతులు ఆయుధ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దుర్గా మాత ఆశీస్సులతో పోలీసులందరూ సంతోషంగా జీవించాలన్నారు. జిల్లా ప్రజలతో మమేకమైన పోలీసుశాఖ ప్రతిష్టను పెంపొందించాలన్నారు. అదనపు ఎస్పీ ప్రకాష్‌బాబు, ఏఆర్ డీఎస్పీ మురళీధర్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు దూలం సురేష్, ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్ తదితరులున్నారు.



ఆయుధ పూజ చేస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు దంపతులు

అందుబాటులో అత్యాధునిక దంత చికిత్స



గోకుల్ డెంటల్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవి, తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, వైద్యులు

మారుతీనగర్, న్యూస్‌టుడే: గత నలభై అయిదేళ్లుగా దంత వైద్య రంగంలో రాణిస్తూ అత్యాధునిక చికిత్సను నగర వాసులకు అందిస్తున్నామని డాక్టర్ సందా సూర్యప్రకాష్ తెలిపారు. కడప గోకుల్ సర్కిల్‌లో నూతన ఏర్పాటు చేసిన శ్రీసత్యసాయి గోకుల్ డెంటల్ సూపర్ స్పెషాలిటీ డిజిటల్ క్లినిక్‌ను విజయదశమి సందర్భంగా ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా కడప ఎమ్మెల్యే మాధవి, తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కర్నూలు మాజీ ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, ఇంటాక్ కన్వీనర్ చిన్నపరెడ్డి హాజరయ్యారు. డాక్టర్ సూర్యప్రకాష్ మాట్లాడుతూ డాక్టర్ సందా ఆకాష్, డాక్టర్ సందా కావ్య ఆధ్వర్యంలో ఎండోడాంటీ, ఆర్థోడాంటీ, ప్రాస్థోడాంటీ, పీరియోడాంటీ, రూట్‌కెనాల్ వైద్యం, డెంటల్ ఇన్‌ప్లాంట్స్ చికిత్స అందిస్తామని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. డాక్టర్ సందా మహాలక్ష్మి, డాక్టర్ సందా ఉపజ్ఞ, డాక్టర్ మామిళ్ల హరీష్, డాక్టర్ సందా సాయిదేవస్మిత తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద మృతి కాదు.. హత్యే!

భార్యే హంతకురాలు

కేసముద్రం, న్యూస్‌టుడే: తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం పెనుగొండ గ్రామంలో మూడు రోజుల కిందట అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన వ్యక్తిది హత్య అని.. సోదరుడు, తల్లితో కలిసి అతడి భార్య చంపివేసినట్లు పోలీసులు శనివారం తెలిపారు. ఈమేరకు నిందితులను అదుపులోకి తీసున్నామన్నారు. కేసముద్రం ఇన్‌ఛార్జి సీఐ బాబురావు, ఎస్సై మురళీధర్‌రాజు తెలిపిన వివరాల మేరకు.. కడపకు చెందిన లక్క ప్రశాంత్, అమీనా దంపతులు ఉపాధి కోసం కేసముద్రం మండలం పెనుగొండ గ్రామానికి వలస వచ్చారు. అమీనా సోదరుడు కడియాల అమీర్‌బాషా, తల్లి కడియాల నూర్జహాన్ ఇదే గ్రామానికి వలస వచ్చి ప్రశాంత్ ఇంటి సమీపంలోని మరో ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. ఇద్దరు పిల్లలున్న అమీనాను ప్రశాంత్ రెండో వివాహం చేసుకున్నారు. కొద్ది రోజులుగా అమీనాపై అనుమానం పెంచుకున్న ప్రశాంత్ రోజూ మద్యం తాగి భార్యను చిత్రహింసలకు గురిచేస్తున్నారు. అక్రమ సంబంధాలు అంటగడుతూ వేధిస్తున్నారు. ఎప్పటికైనా తనను చంపేస్తాడని భావించిన అమీనా ప్రశాంత్‌ను హత్య చేయాలని నిర్ణయించుకుంది. ప్రశాంత్ పెడుతున్న బాధలను అమీనా తన సోదరుడు, తల్లికి వివరించింది. ఇలాగే ఉంటే ప్రశాంత్ తనను, పిల్లలను అవసరమైతే తల్లి, సోదరుడిని కూడా చంపేస్తాడని చెప్పింది. వారు ముగ్గురు ప్రశాంత్‌ను హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల పదోతేదీ రాత్రి 2.30గంటల సమయంలో గాఢ నిద్రలో ఉన్న ప్రశాంత్ మెడకు తాడు బిగించి చంపేశారు. గరిటెను వేడి చేసి భర్త మర్మాంగాలపై కాల్చింది. అనుమానం రాకుండా ఆత్మహత్యగా చిత్రీకరించాలని యత్నించారు. మహబూబాబాద్ నుంచి ఆటోను రప్పించారు. ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడని నమ్మించి మృతదేహాన్ని ఆటోలో మహబూబాబాద్ తీసుకెళ్లారు. ఆటోను రైల్వే గేటు సమీపంలోకి తీసుకెళ్లాలని చెప్పడంతో అనుమానించిన ఆటో డ్రైవర్ రాము 100 నెంబరకు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు పంపించారు. పోలీసులకు సమాచారం అందించి బాధ్యతాయుతంగా వ్యవహరించిన ఆటో డ్రైవర్ రాము, వెంటనే స్పందించి నిందితులను అరెస్టు చేసిన ఎస్సై మురళీధర్‌రాజును ఎస్పీ అభినందించారు.

జాతీయస్థాయి పోటీల్లో సిరివెళ్ల ఎడ్లకు ప్రథమ స్థానం

అట్లూరు, న్యూస్‌టుడే : అట్లూరు క్రాస్‌రోడ్డులోని అవధూత అబ్బిరెడ్డి స్వామి దసరా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జాతీయస్థాయి ఒంగోలుజాతి వృషభరాజాల బండలాగుడు పోటీల్లో నంద్యాల జిల్లా సిరివెళ్ల మండలం గుంపరమాన్‌దిన్నె గ్రామానికి చెందిన కుందూరు రాంభూపాల్‌రెడ్డి (కేఆర్‌బీఆర్) ఎడ్లకు ప్రథమ బహుమతిగా రూ. 70,116 అందజేశారు. ద్వితీయ స్థానంలో మైదుకూరుకు చెందిన వెంకటేష్ యాదవ్ ఎడ్లు నిలవగా రూ. 50,116 దక్కాయి. తృతీయ స్థానంలో వైఎంఆర్ కాలనీ ప్రొద్దుటూరుకు చెందిన గురివిరెడ్డి ఎడ్లకు రూ. 30,116 దక్కాయి. బండలాగుడు పోటీలను ప్రారంభ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, బొజ్జా రోశన్న, తెదేపా నాయకులు సూర్యనారాయణరెడ్డి, నందగోపాల్‌రెడ్డి, రెడ్డయ్య, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు విజయమ్మ అబ్బిరెడ్డి మఠంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



అట్లూరు క్రాస్ రోడ్డులో బండలాగుతున్న ఎడ్లు

రామలింగచౌడేశ్వరి ఆలయానికి రూ.5.50 లక్షల విరాళం



ఆలయ అధ్యక్షుడు ఉట్టి నాగశయనానికి నగదును అందజేస్తున్న కృష్ణయ్య, తదితరులు

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని మేదరవీధిలో ఉన్న రామలింగచౌడేశ్వరి అమ్మవారి ఆలయానికి ఎన్‌జీవో సంఘం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పి.వి. రమణయ్య అతని సోదరులు విశ్రాంత లెక్చరర్ కృష్ణయ్య, డాక్టర్ పీవీ.చంద్రశేఖర్, డాక్టర్ కవిత ప్రసన్న దంపతులు రూ. 5,50,000 నగదును ఆలయ అధ్యక్షుడు ఉట్టి నాగశయనానికి విజయదశమి పండగ సందర్భంగా శనివారం అందజేశారు. దీపధూప నైవేద్యాలు, నిరంతర సేవ నిమిత్తం ఈ నగదు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి శ్రీనివాసులు, సంఘ కార్యదర్శి ఈశ్వరయ్య, కల్యాణ మండపం అధ్యక్షుడు రెడ్డిచంద్రశేఖర్, కార్యదర్శి వెంకటసుబ్బరాయుడు, కోశాధికారి వెంకటాచలపతి, దేవస్థాన గౌరవాధ్యక్షులు వెంకటలక్ష్మయ్య, రామచంద్రుడు, లక్ష్మీనారాయణ, వీరభద్రుడు పాల్గొన్నారు.

సాయిబాబా గుడి నిర్మాణానికి చేయూత



ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న దాత వెంకట్

లింగాల, న్యూస్‌టుడే : పార్నపల్లెలో నూతనంగా నిర్మించిన సాయిబాబా ఆలయానికి అదే గ్రామానికి చెందిన మొరుసు రామస్వామి కుటుంబ సభ్యులు రూ. 5,11,116 వితరణ చేశారు. గ్రామస్థులు విరాళాలతో సాయిబాబా ఆలయానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా తమ తండ్రి మొరుసు రామస్వామి జ్ఞాపకార్థం కుమారులు వెంకట్ ఆలయ కమిటీ సభ్యులకు ఆదివారం నగదు అందించారు. దాతను గ్రామస్థులు అభినందించారు.

గండి అంజన్నకు వెండి స్పటిక పాత్ర వితరణ



వెండి స్పటిక పాత్రను అర్చకుడికి అందజేస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

వేంపల్లె, చక్రాయపేట, న్యూస్‌టుడే : దసరా పండుగను పురస్కరించుకుని గండిక్షేత్రంలోని వీరాంజనేయస్వామిని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి వెండి స్పటికపాత్రను ఆలయ ప్రధాన అర్చకుడు కేసరిస్వామికి అందించారు. దీని విలువ సుమారు రూ. 2 లక్షలు ఉంటుందని తెలిపారు. అనంతరం ఆలయ నిర్వాహకులు వారిని శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

బ్యాటర్ల హోరు.. బౌలర్ల జోరు



తేజేష్ (4 వికెట్లు)



సాయికృష్ణచైతన్య (134 పరుగులు)



తాహీర్ (66 పరుగులు)

కడప క్రీడలు, న్యూస్‌టుడే: ఏసీఏ అండర్-14 పురుషుల రెండు రోజుల మల్టీడే క్రికెట్ టోర్నీలో భాగంగా కేవోఆర్‌ఎం మైదానంలో చిత్తూరు, తూర్పుగోదావరి జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన తూ.గో.జట్టు 63.5 ఓవర్లలో 205 స్కోరు చేసింది. కార్తీక్ 44, రాజ ఆర్యన్ 30 పరుగులు చేశారు. బౌలర్లు తేజేష్ 4, దినేష్, ఆశిష్‌రెడ్డి చెరో 2 వికెట్లు తీశాడు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు ఆట ముగిసే సమయానికి 37 ఓవర్లలో 118/6 స్కోరు చేసింది.

☆ కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో కర్నూలుతో జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 346/7 స్కోరు చేసింది. బి.సాయి కృష్ణచైతన్య సెంచరీ (134✦, 180 బంతుల్లో, 28×4)తో సత్తాచాటగా, తాహీర్ 66 పరుగులు చేశారు. కర్నూలు బౌలర్లు పి.వివేక్ 3, కేవీ.హరిహరణ్ 2 వికెట్లతో మెరిశారు.

☆ వైఎస్‌ఆర్‌ఆర్-ఏసీఏ క్రికెట్ మైదానంలో ప్రకాశంతో మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన ప.గో.జట్టు 90 ఓవర్లలో 224/7 స్కోరు చేసింది. కేపీ నారాయణ 71, జితేష్ సాయిరెడ్డి 74✦ పరుగులు చేశారు. అనంతరం మొదటి ఇనింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన ప్రకాశం జట్టు ఆట ముగిసే సమయానికి 24/2 స్కోరు చేసింది.

'కేంద్ర ప్రభుత్వ వేధింపులతోనే ప్రొఫెసర్ సాయిబాబా మృతి'

మారుతీనగర్, న్యూస్‌టుడే: ప్రొఫెసర్ సాయిబాబా మృతికి కేంద్రప్రభుత్వమే కారణమని, ఆయనను కక్షపూరితంగా మానసికంగా హింసించారని, దీనిపై లోతైన విచారణ జరపాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి డిమాండు చేశారు. స్థానిక జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ సాయిబాబాపై ఎలాంటి ఆధారాలు లేకపోయినా పదేళ్ల పాటు జైలులో క్రూరంగా నిర్బంధించారని, అప్పటికే తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనకు ఎలాంటి వైద్య సౌకర్యాలు కల్పించలేదని ఆరోపించారు. భాజపా ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని వ్యాఖ్యానించారు. రాకపా రాష్ట్ర నాయకులు సిద్ధిరామయ్య పాల్గొన్నారు.

బకాయిల చెల్లింపులో జాప్యం తగదు



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

కడప విద్య, న్యూస్‌టుడే : ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన బకాయిల చెల్లింపులో జాప్యం తగదని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ జేఏసీ కార్యదర్శి ప్రసాద్ అన్నారు. స్థానిక యూటీఎఫ్ భవన్‌లో ఆదివారం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు దాచుకున్న ప్రావిడెంట్ ఫండ్ సొమ్ములను సైతం గత ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించిందని ఆరోపించారు. పీఆర్సీ కూడా అమలుకు నోచుకోలేదని చెప్పారు. దసరా కానుకగా మధ్యంతర భృతి అయినా ప్రకటిస్తారని ఆశగా ఎదురుచూసిన ఉద్యోగుల ఆశలపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం నీళ్లు చల్లిందన్నారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే కృషి చేయాలన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు, రవికుమార్, శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, షేక్ జాబీర్, జిల్లా కార్యదర్శి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు


బషీరున్నీసాకు ఘన నివాళి

మారుతీనగర్, న్యూస్‌టుడే: సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు, ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకురాలు బషీరున్నీసా మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర పేర్కొన్నారు. ఆమె అనారోగ్యంతో శనివారం కన్నుమూశారు. స్థానిక భగత్‌సింగ్ నగర్‌లోని బషీరున్నీసా భౌతిక కాయానికి ఆదివారం నివాళులర్పించారు. ఏపీ మహిళా సమాఖ్య నాయకురాలిగా, మహిళా హక్కులపై అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు తులసిరెడ్డి, తెదేపా నాయకులు లక్ష్మిరెడ్డి, అమీర్‌బాబు, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, నారాయణ, అన్నమయ్య జిల్లా సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు తదితర నాయకులు నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

శనగ... విత్తుకు బెంగ

☆ చేతులెత్తేసిన విత్తన సరఫరాదారులు
☆ అదను దాటుతుందని కర్షకుల ఆందోళన

న్యూస్‌టుడే, కడప గ్రామీణ, కడప, కొండాపురం



పాత బకాయిలు చెల్లించలేదని సరఫరాదారులు చేతులెత్తేయడం, అధికారుల ముందుచూపులేమి, ప్రణాళిక లోపం.. శనగ రైతులకు శాపంగా మారింది. సీజన్ ప్రారంభమై 13 రోజులైనా నిర్దేశిత కోటాలో అయిదు శాతం కూడా రైతు సేవా కేంద్రాలకు చేరలేదు. దీంతో అదను దాటిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

62 వేల క్వింటాళ్లకు వచ్చింది 3 వేలే...

జిల్లాలో ఈ రబీ సీజన్‌లో నల్లరేగడి భూములు ఉన్న 31 మండలాల్లో శనగ పంట సాధారణ విస్తీర్ణం 82,261 హెక్టార్లు. జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, పులివెందుల, కమలాపురం, మైదుకూరు, బద్వేలు, కడప తదితర ప్రాంతాల్లో ఈ పంట ఎక్కువగా సాగు చేస్తారు. ఉన్నతాధికారులు ఈ సారి జె.జి-11 రకం 72,386 క్వింటాళ్లను జిల్లాకు కేటాయించారు. క్వింటా పూర్తి ధర రూ. 9,400 కాగా ప్రభుత్వం ఇచ్చే రాయితీ రూ. 2,350 (25 శాతం) పోను రైతులు రూ. 7,050 (75 శాతం) చెల్లించాలి. జిల్లాలో తొలి విడతలో 24 మండలాల్లో 62,386 క్వింటాళ్లను పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే రైతు సేవా కేంద్రాలకు 25,605 మంది 38,097 క్వింటాళ్లు కావాలని పేర్లు నమోదు చేసుకున్నారు. అందులో 6,736 మంది 9,397 క్వింటాళ్లకు రూ. 6.62 కోట్లు చెల్లించారు. ఇప్పటికి కేవలం 3,323.4 క్వింటాళ్ల విత్తనాలే వచ్చాయి.

చర్యలు చేపట్టని అధికారులు

జిల్లాలో ప్రతి ఏటా శనగలను సేకరిస్తున్న సరఫరాదారులు ఈదఫా మాత్రం వెనకడుగు వేశారు. ఖరీఫ్‌లో వేరుసెనగ సరఫరాకు సంబంధించి పూర్తి స్థాయిలో డబ్బులు చెల్లించలేదు. దీంతో బకాయిలు చెల్లిస్తేనే శనగ విత్తనాలు సరఫరా చేస్తామని వారు మెలిక పెట్టారు. ఈ సమస్య గత కొన్ని నెలలుగా ఉన్నప్పటికీ ఏపీ విత్తనాభివృద్ధి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

మండలం	సాగు అంచనా (హెక్టార్లలో)	కేటాయింపు (క్వింటాళ్లలో)	వచ్చింది
వేముల	3,568	2,876	150
కొండాపురం	4,055	3,042	587.2
కమలాపురం	5,946	4,460	1000
సింహాద్రిపురం	7,520	5,641	1,5,86.2

● మిగతా మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

ఒంగోలు నుంచి తీసుకొస్తున్నాం

పాత బకాయిలు చెల్లిస్తేనే విత్తనాలు ఇస్తామని సరఫరాదారులు చెబుతున్నారు. ప్రత్యామ్నాయంగా ఒంగోలు నుంచి తీసుకొస్తున్నాం. జిల్లాకు 72,386 క్వింటాళ్లు కేటాయించగా 3,323 క్వింటాళ్లను సరఫరా చేశాం. మిగతా విత్తనాలను కూడా వీలైనంత త్వరగా రప్పించి, రైతు సేవా కేంద్రాలకు చేర్చుతాం. **- జగదీష్, జిల్లా మేనేజర్, ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ, కడప**

బకాయిలు చెల్లిస్తేనే సేకరణ చేపడతాం

గతంలో సరఫరా చేసిన విత్తనానికి సంబంధించిన బకాయిలు చెల్లిస్తేనే ఇప్పుడు శనగ విత్తనాన్ని సేకరిస్తాం. బ్యాంకుల్లో అప్పు తెచ్చి వ్యాపారం చేస్తున్నాం. మన జిల్లాలో విత్తనం లేదు. ఒంగోలు, గిద్దలూరు లాంటి ప్రాంతాలకు వెళ్లి తీసుకురావాల్సి ఉంటుంది. **- ఆంజనేయులురెడ్డి, సరఫరాదారుల సంఘ ప్రతినిధి, ప్రొద్దుటూరు**

ప్రొద్దుటూరు

• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు

సకాలంలో రాని బస్సులు... ప్రయాణికుల అవస్థలు



దసరా సెలవులు ముగియడంతో ప్రజలు తిరుగు ప్రయాణమయ్యారు. తగినన్ని బస్సులు లేక ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. జమ్మలమడుగు నుంచి తాడిపత్రి, కోవెలకుంట్ల, కర్నూలు తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు స్థానిక అన్న క్యాంటీన్ వద్ద తాడిపత్రి బస్టాప్‌లో వేచి ఉంటారు. ఆదివారం తాడిపత్రి బస్టాప్ ప్రయాణికులతో రద్దీగా మారింది. డిపో మేనేజరు ప్రవీణ్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా తాడిపత్రి వైపు వెళ్లాల్సిన బస్సుల ఆలస్యానికి కారణాలు కనుక్కుంటామన్నారు. ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా వెంటనే జాగ్రత్తలు తీసుకుంటున్నారు. బెంగళూరు, హైదరాబాద్, తిరుపతి, విజయవాడ తదితర దూర ప్రాంతాలకు పది సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. -న్యూస్‌టుడే, జమ్మలమడుగు

ఏ దారి ఎటు పోతుందో?



జమ్మలమడుగు - ముద్దనూరు ప్రధాన రహదారిలోని పెన్నా వంతెన వద్ద పలు ప్రాంతాలకు వెళ్లే ఊర్ల పేర్లు తెలిపే బోర్డుకు ముళ్లపొదలు అల్లుకుని కనిపించకుండా పోయాయి. ముద్దనూరు, కడప, తాడిపత్రి, గండికోట ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు సూచిక కనిపించకపోవడంతో ఇటుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు గందరగోళానికి గురవుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారు మరింత ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ముళ్లపొదలు తొలగించి సూచిక ఫలకం కనిపించేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, జమ్మలమడుగు గ్రామీణ

స్తంభాన్ని ఢీకొన్న టిప్పరు

● విద్యుత్తు సరఫరాకు అంతరాయం

మైదుకూరు, న్యూస్‌టుడే : మండలంలోని ఆదిరెడ్డిపల్లె సమీపంలో గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ పనులు చేస్తున్న గుత్తేదారుకు చెందిన టిప్పర్ విద్యుత్తు స్తంభాన్ని ఢీకొంది. దీంతో నియంత్రిక ఉన్న స్తంభంతోపాటు పలు స్తంభాలు ఒరిగి పోవడంతో వ్యవసాయ బోర్లకు విద్యుత్తు సరఫరా ఆగిపోయింది. ఐదురోజులవుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని రైతులు వాపోతున్నారు. పసుపు, ఉల్లి, అరటి పంటలకు నీరు పారించలేక పోతున్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఇన్‌ఛార్జ్ ఏఈ రామభద్రయ్యను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఇప్పటికే గుత్తేదారు సిబ్బందితో మాట్లాడినట్లు తెలిపారు.

మట్టి తవ్వకాలపై వివాదం

మైదుకూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎల్లంపల్లె సమీప గుట్టిపల్లె వద్ద మట్టి తవ్వకాలు చేపట్టడం వివాదాస్పదమైంది. అనుమతి ఉందని చెబుతూ ప్రైవేట్ ఏజెన్సీకి చెందిన వారు రెండురోజులుగా మట్టి తవ్వకాలు చేయడంపై స్థానికంగా చర్చనీయాంశమైంది. వీరు ట్రిప్పునకు రూ.250 చొప్పున వసూలు చేస్తున్నారని సమాచారం. తహసీల్దారు నుంచి అనుమతి తీసుకుని తవ్వకాలు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించినా మైనింగ్ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలని రెవెన్యూ అధికారులు చెబుతూ వచ్చారు. రాయల్టీ మాత్రమే స్వీకరిస్తూ రశీదులివ్వడంలేదని స్థానికులు గుర్తించారు. ఏజెన్సీకి చెందిన వ్యక్తిని ప్రశ్నించడంతో పొక్లెయిన్, ట్రాక్టర్లతో ఆప్రాంతం నుంచి వెళ్లి పోయారు. ఈ విషయమై తహసీల్దారు రాజసింహ నరేంద్రను వివరణ కోరగా మట్టి తవ్వకాలపై ప్రైవేట్ ఏజెన్సీకి అనుమతి ఇచ్చారనే విషయాన్ని మైనింగ్ అధికారులు చెప్పారన్నారు.



ట్రాలీలో మట్టి పోస్తున్న పొక్లెయిన్

సెల్ఫీ మోజులో ప్రమాదం

● బాలుడి గల్లంతు.. కొనసాగుతున్న గాలింపు



గౌతమ్

మహానంది, న్యూస్‌టుడే : నంద్యాల జిల్లా మహానంది మండలం అయ్యన్ననగర్ సమీపంలోని తెలుగుగంగ ప్రధాన కాల్వలో శనివారం సాయంత్రం గల్లంతయిన బాలుడి కోసం పోలీసులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది గాలింపు కొనసాగిస్తున్నారు. ఎస్సై ఎన్.రామమోహన్ రెడ్డి ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. బద్వేలు పట్టణం ఐలమ్మకాలనీకి చెందిన 17 ఏళ్ల సురసుర గౌతమ్, ఇతని బావ మహేశ్ ఇద్దరూ మహానందిలోని ఈశ్వర్‌నగర్‌లో జరుగుతున్న బంధువుల వివాహానికి హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. దారి మధ్యలో తెలుగుగంగ కాల్వ వద్ద సెల్ఫీ తీసుకునేందుకని దిగారు. అక్కడ మహేశ్ ప్రమాదవశాత్తు కాల్వలో పడిపోయాడు. అతన్ని కాపాడేందుకు గౌతమ్ నీటిలోకి దూకాడు. ఈత రాకపోయినప్పటికీ మహేశ్ చెట్ల కొమ్మలు పట్టుకుని బయటపడ్డారు. గౌతమ్‌కు ఈత వచ్చినప్పటికీ ప్రవాహ ఉద్ధృతికి కాల్వలో కొట్టుకుపోయాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు శని, ఆదివారాల్లో కాల్వ వెంట వెదికినా ఆచూకీ లభించ లేదు. గౌతమ్ తల్లి మహాలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు స్వీకరించి, గాలింపు కొనసాగిస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కారు, ద్విచక్ర వాహనం ఢీ

ఖాజీపేట: రావులపల్లె చెరువు వద్ద కడప-కర్నూలు రహదారిపై ఆదివారం రాత్రి ప్రమాదం చోటుచేసుకుంది. కారు, ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో రావులపల్లెకు చెందిన కుమార్‌కు గాయాలయ్యాయి. ఖాజీపేట నుంచి గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్లే క్రమంలో రహదారి దాటుతుండగా కడప నుంచి నంద్యాల వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన కుమార్‌ను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

దూసుకొచ్చిన కారు.. తప్పిన ప్రమాదం

బద్వేలు, న్యూస్‌టుడే: స్థానిక నెల్లూరురోడ్డులోని బొమ్మరిల్లు రెస్టారెంట్ వద్ద ఆదివారం బద్వేలు వైపు నుంచి వస్తున్న గుర్తు తెలియని ఓ కారు వేగంగా వచ్చి ద్విచక్రవాహనంపై వస్తున్న మోహన్ అనే వ్యక్తిని ఢీకొనడంతో గాయపడ్డారు. పట్టణంలో రోజు రోజుకు ద్విచక్ర, నాలుగు చక్రాలు, భారీ వాహనాలు మితిమీరిన వేగంతో వెళ్తుండటంతో పాదచారులు వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

మైదుకూరులో గొలుసు చోరీ

మైదుకూరు: స్థానిక నంద్యాలరోడ్డులో శనివారం చైన్ స్నాచింగ్ జరిగింది. లింగాలదిన్నె గ్రామానికి చెందిన భూమిరెడ్డి వెంకటరాధ రహదారిపై నిలబడి ఉండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన వ్యక్తి మహిళ మెడలోని 40 గ్రాముల బంగారు గొలుసు లాక్కొని ఉడాయించాడు. సమీపంలోనే ఉన్న పోలీసులు మరో ద్విచక్ర వాహనంపై వెంబడించినా ఫలితం లేకపోయింది.

ద్విచక్ర వాహనాలకు నిప్పు

బద్వేలు: పట్టణంలోని వెంకటయ్యనగర్‌లో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు బయట పార్కింగ్ చేసి ఉంచిన రెండు ద్విచక్ర వాహనాలకు నిప్పు పెట్టారు. ద్విచక్రవాహనాల నుంచి మంటలు రావడంతో బాధితులు పట్టణ పోలీసుస్టేషన్ను ఆశ్రయించారు. ఈ ఘటనపై బాధితుల నుంచి ఫిర్యాదు అందుకున్న పట్టణ పోలీసులు నిందితుల ఆచూకీకోసం గాలిస్తున్నారు.

జూదరుల అరెస్టు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: స్థానిక ఈడిగపేటలో జూదమాడుతున్న 22 మందిని అరెస్టు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. వీరి నుంచి రూ. 1.20 లక్షల నగదు, 21 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

వ్యక్తిపై కేసు నమోదు

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: మద్యం తాగిన వాహనం నడిపిన కలసపాడు మండలం శంకవరం గ్రామానికి చెందిన తిరుపతయ్య కేసు నమోదు చేశామని ఎస్సై కొండారెడ్డి తెలిపారు. మల్లకత్తువ వద్ద ఆదివారం వాహనాలు తనిఖీ చేశామని తెలిపారు. ఈ తనిఖీలో ఆయన పట్టుబడ్డారన్నారు.

మందలించినందుకు కత్తితో దాడి

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పట్టణంలో వేర్వేరు ఘటనల్లో కత్తితో దాడి చేయడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. రెండో పట్టణ పోలీసుల వివరాల ప్రకారం.. స్థానిక శ్రీనివాస నగర్‌లో పెయింటర్‌గా పనిచేసే కాలేషావలి శనివారం రాత్రి మైదుకూరురోడ్డులో కూర్చొని ఉండగా అతని పక్కనే కాసింపీరా అనే వ్యక్తి సిగరెట్ తాగుతూ నిలబడ్డాడు. తనకు సిగరేట్ పొగ పడదని దూరంగా వెళ్లమని కాలేషావలి చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో కాసింపీరా కొందరు వ్యక్తులతో కలిసి కాలేషావలిపై కత్తితో దాడి చేశాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని రిమ్స్‌కు తరలించారు.

మీద పడ్డావన్నందుకు మరో వ్యక్తిపై...



ఏకే రోడ్డుకు చెందిన ప్రైవేటు ఉద్యోగి చింతల సుధీర్ దసరా వేడుకలను చూసేందుకు స్నేహితులతో వచ్చాడు. ఆదివారం తెల్లవారుజామున రాజీవ్‌కూడలి వద్ద ఓ వ్యక్తి **సుధీర్‌**పై పడ్డాడు. దీంతో తనపై ఎందుకు పడ్డావని ప్రశ్నించడంతో ఇరువురికి గొడవ జరిగింది. కాసేపటికి ఓ యువకుడు మరో నలుగురితో కలిసి వచ్చి సుధీర్‌పై కత్తితో దాడి చేసి పరారయ్యారు. సుధీర్‌ను స్నేహితులు జిల్లా ఆసుపత్రికి తరలించారు.

రూ.8.50 కోట్లతో అభివృద్ధి పనులు

కూటమి ప్రభుత్వంలో గ్రామాలకు మహర్దశ

-న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు గ్రామీణ



సీతంపల్లెలో ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్డు

కేంద్ర ప్రభుత్వం గతంలో గ్రామ పంచాయతీల ప్రగతి, అభివృద్ధి నిమిత్తం మంజూరు చేసిన రూ.లక్షల ఆర్థిక సంఘ నిధులను నిబంధనలకు విరుద్ధంగా వైకాపా ప్రభుత్వం పక్కదారిపట్టించడంతో గ్రామాభివృద్ధి పడకేసింది. ఆర్థిక ఇబ్బందులతో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు కాని దుస్థితి ఏర్పడింది. గ్రామాల్లో ఎర్రమట్టి రోడ్లు, కంకర్లు, తారు రహదారులు, కాలువలు, వంతెనలు లేక ప్రజలు అవస్థలు పడ్డారు. ఆర్థిక వనరులను నిర్వీర్యం చేయడంతో సర్పంచులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో గ్రామ స్వరాజ్యం బలోపేతానికి దిద్దుబాటు చర్యలు ఉపక్రమించారు. ఫలితంగా గత ఆగస్టు 23న గ్రామసభల్లో స్థానిక ప్రజావసరాలు, ప్రయోజనాలు దృష్ట్యా ఎమ్మెల్యేలు ఆమోదించిన అభివృద్ధి పనులకు కలెక్టర్లు అనుమతి మంజూరు చేశారు. దీంతో ఈ నెల 14వ తేదీ నుంచి పల్లె పండగ వారోత్సవాల కార్యక్రమాలకు మార్గదర్శకాలను రూపొందించారు. ఏడు రోజుల వ్యవధిలో ఎమ్మెల్యేల పర్యవేక్షణలో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలకు భూమి పూజలు చేపట్టి వచ్చే సంక్రాంతిలోపు పనులను పూర్తి చేయాలని నిర్దేశించారు. దీంతో ఉపాధి హామీ నిధుల కింద మెటీరియల్ వినియోగం ద్వారా అభివృద్ధి పనులతో గ్రామాలకు మహర్దశ పట్టనుందని పలువురు సర్పంచులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు, కాలువలు లేక వర్షాలు వస్తే అధ్వాన పరిస్థితులతోపాటు గ్రామస్థుల సమస్యలకు పరిష్కారం ఉంటుందని చెబుతున్నారు.

పల్లె ప్రజలకు మెరుగైన సౌకర్యాలు

నియోజకవర్గంలో ఎమ్మెల్యే సిఫార్సుతో ఉపాధి హామీ పథకం కింద మొత్తం రూ.8.50 కోట్ల పనులకు ఆమోదం మంజూరైంది. దీంతో ప్రొద్దుటూరు మండల పరిధిలో 48 పనులకు రూ.4.20 కోట్లు కేటాయించారు. రూ.4.05 కోట్లతో 45 చోట్ల మొత్తం 8.10 కి.మీ చొప్పున కాంక్రీటు రహదారులు, కాలువల నిర్మాణాలు ఉన్నాయి. రూ.15 లక్షలతో కంకర రోడ్లు, 2 చోట్ల ప్రహరీలకు రూ.10 లక్షలతో పనులు చేపట్టనున్నారు. దీంతో ఆర్థిక లేమితో ప్రగతి లేని సీతంపల్లె, కామనూరు, నంగనూరుపల్లె, తాళ్లమాపురం, దొరసానిపల్లె పంచాయతీల్లో మెరుగైన సౌకర్యాలకు దోహదపడుతున్నాయి.

● రాజుపాళెం మండలంలో 29 పనులకు రూ.4.20 కోట్లు మంజూరు చేశారు. రూ.3.05 కోట్లతో 25 చోట్ల 6.10 కి.మీ సీసీరోడ్లు, కాలువల నిర్మాణాలను చేపడతారు. రూ.15 లక్షలతో కంకర రహదారి, రూ.కోటితో మూడు చోట్ల 2.60 కి.మీ తారు రోడ్ల అభివృద్ధి పనులు రానున్నాయి.

ఉపాధి హామీ నిధులు వ్యయం

ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల పరిధిలో గ్రామ సభల్లో ఆమోదించిన అభివృద్ధి పనులు చేపట్టడానికి కలెక్టరు అనుమతి తెలిపారు. ఈ నెల 14 నుంచి పల్లె పండగ వారోత్సవాలు అనంతరం ఆయా చోట్ల సకాలంలో మెరుగైన సౌకర్యాలను ఏర్పాటు చేస్తాం.
-లక్ష్మీనారాయణరెడ్డి, పీఆర్ డీఈ, ప్రొద్దుటూరు

స్పందనకు వందనం

కొండాపురం: స్థానిక రామసుబ్బారెడ్డి కాలనీలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టి, బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేశారు. దోమల బారి నుంచి రక్షణ పొందడానికి దోమతెరలు వాడాలని తెలిపారు. వారంలో ఒక రోజు డ్రై డే పాటించాలని, వర్షం, మురుగునీరు ఇంటి పరిసరాల్లో నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. ఈ ప్రాంతంలోని సమస్యపై శుక్రవారం వార్తాంశం ప్రచురితమవడంతో అధికారులు స్పందించి సమస్య పరిష్కరించారు.

కొండాపురం: స్థానిక ప్రభుత్వ వైద్యశాల ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశాలను శుభ్రం చేశారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో వైద్య సిబ్బంది మొక్కలు నాటారు. వైద్యశాల ఆవరణలో పిచ్చిమొక్కలు ఉన్నాయని సమస్యపై శుక్రవారం వార్తాంశం ప్రచురితమవడంతో వైద్య సిబ్బంది స్పందించి సమస్యను పరిష్కరించారు.

తీగజాతి మొక్క తొలగింపు

మైదుకూరు: పురపాలక ఇందిరమ్మకాలనీలో విద్యుత్తు నియంత్రిక కంచె చుట్టూ అల్లుకున్న తీగజాతి మొక్కను అధికారులు తొలగించేలా చర్యలు తీసుకున్నారు. 'అల్లుకున్న నిర్లక్ష్యం' శీర్షికతో శుక్రవారం ప్రచురితమైన కథనానికి స్పందించి ప్రమాదాలకు తావివ్వకుండా తీగజాతి మొక్కను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు.

రిజర్వాయర్ తూముకు తాత్కాలిక మరమ్మతులు

బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే: మండలంలోని మడేరు రిజర్వాయర్ తూముకు అధికారులు శనివారం తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. 'దెబ్బతిన్న తూము.. ఖాళీ అయిన జలాశయం' అనే శీర్షికతో ప్రచురితమైన కథనంపై ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ స్పందించారు. నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడి వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. డీఈ వేణుగోపాల్‌రెడ్డి, ఏఈ నవీన్ పరిశీలించి మరమ్మతులు చేపట్టారు.

తెదేపాలో చేరిన వైకాపా కౌన్సిలర్



మీగడ దీప్తికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి, పక్కన నాయకులు

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పురపాలక వైకాపా కౌన్సిలర్ మీగడ దీప్తి (30వ వార్డు), ఆమె భర్త చంద్రశేఖర్‌రెడ్డి తెదేపాలో చేరారు. శనివారం వారి స్వగృహంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులురెడ్డి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెదేపాతోనే ప్రొద్దుటూరు అభివృద్ధి జరుగుతుందని నమ్మి వారు పార్టీలో చేరారన్నారు. వారి వార్డు అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలందిస్తామన్నారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రం అభివృద్ధిపథంలో దూసుకుపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ముక్తియార్, నాయకులు ఈవీ.సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రైస్తవులకు అండగా తెదేపా



ఈటె స్వామిదాసును సన్మానిస్తున్న ఫాదర్ సాల్మన్‌బాబు తదితరులు

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: క్రైస్తవులకు తెదేపా ప్రభుత్వం అండగా ఉంటుందని ఆ పార్టీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాసు అన్నారు. స్థానిక సీఎస్ఐ టౌన్‌చర్చిలో ఫాదర్ సాల్మన్‌బాబు ఆధ్వర్యంలో ఆదివారం ఆయనను ఘనంగా సన్మానించారు. సామిదాసు మాట్లాడుతూ.. వైకాపా ప్రభుత్వంలో మూతపడిపోయిన క్రిస్టియన్ భవన్‌కు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చంద్రబాబునాయుడు రూ. 10 కోట్లు కేటాయించి పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చర్చి కార్యదర్శి ప్రభుకుమార్, ట్రెజరర్ దేవకృప, జైకుమార్, డేవిడ్‌రాజు, దేవ సహాయం తదితరులు పాల్గొన్నారు.

ఫర్నిచర్ దుకాణం ప్రారంభం



దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన్‌రావు

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పట్టణంలోని మైదుకూరురోడ్డులో ఎం.సి. ఫర్నిచర్, ఇంటీరియర్ దుకాణాన్ని ఎం.సునీల్‌కుమార్, పి.ఎస్.నవాజ్ ఏర్పాటు చేశారు. దీనిని ఆదివారం ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన్‌రావు ప్రారంభించారు. ఆధునికంగా ఉన్న వస్తువులు సరళమైన ధరలకు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ముక్తియారు, కొత్తపల్లె సర్పంచి కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, వైద్యుడు నాగార్జున, అబ్దుల్ గఫార్ పాల్గొన్నారు.

అనుడా మాజీ ఛైర్మన్‌కు సత్కారం



గురుమోహన్‌ను సత్కరిస్తున్న సునీల్‌కుమార్

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: విజయదశమి సందర్భంగా అనుడా మాజీ ఛైర్మన్ సింగసాని గురుమోహన్ దంపతులను మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టరు మాలెపాటి సునీల్‌కుమార్ సత్కరించారు. శనివారం గురుమోహన్ నివాసానికి చేరుకుని ఆయన చేస్తున్న అభివృద్ధి సేవా కార్యక్రమాలకు శాలువ పూలమాలలతో సన్మానం చేశారు.

వేడుకగా తొట్టి మెరవణి ఉత్సవం

వసంతోత్సవాలతో ముగిసిన దసరా సంబరాలు



వసంతోత్సవాల్లో ఆర్యవైశ్యుల నృత్య ప్రదర్శన



బి.మఠం: త్రిముఖ దుర్గాదేవి అమ్మవారి ఆలయంలో కలశాలతో తరలి వస్తున్న మహిళలు



జమ్మలమడుగులోని నాగులకట్ట వీధిలో భక్తుల సందడి



బద్వేలులో విజయలక్ష్మి దేవి అలంకారంలో అమ్మవారు



మైదుకూరులో బాణసంచా కాల్చుతున్న యువత



వెల్లాలలో చెన్నకేశవ, భీమలింగేశ్వర, సంజీవరాయ స్వాముల ఊరేగింపు



కొండాపురం: దత్తాపురం పెద్దమ్మ ఆలయంలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


దసరా ఉత్సవాల్లో భాగంగా రెండో మైసూరుగా ప్రసిద్ధిచెందిన ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో వేడుకగా తొట్టిమెరవణిని (గ్రామోత్సవం) నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున ప్రత్యేకంగా అలంకరించిన రథంలో కన్యకాపరమేశ్వరీదేవిని ఊయలలో ఏర్పాటు చేశారు. విజయదశమి రోజున అమ్మవారిశాలలో కన్యకాపరమేశ్వరీదేవి విజయలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ ఏడాది డ్రోన్‌ల ద్వారా విజయలక్ష్మీదేవి ఉత్సవ విగ్రహంపై పూల వర్షం కురిపించడం భక్తులను ఆకట్టుకుంది. శివాలయం, చెన్నకేశవస్వామి, రాజరాజేశ్వరిదేవి వివిధ రకాల ఆలయాల నుంచి అమ్మవార్లు శమీ దర్శనానికి గ్రామోత్సవంగా వచ్చారు. వేలాది సంఖ్యలో భక్తులు విశేషంగా తరలివచ్చారు. శివాలయం కూడలి వద్ద ఆర్యవైశ్యసభ ఆధ్వర్యంలో విభిన్న శబ్దాలు.. రంగులతో టపాసులు పేల్చారు. తొట్టిమెరవణి అనంతరం ఉదయం కన్యకాపరమేశ్వరిదేవి ఆలయానికి చేరుకున్నాక ఎర్రగుంట్లరోడ్డులోని అమ్మవారి తోటలో ప్రత్యేక పూజలు చేశారు ఈ సందర్భంగా ఆర్యవైశ్యులు రంగులు చల్లుకున్నారు. ఉత్సవాల విజయవంతానికి సహకరించిన అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తదితరులకు ఆర్యవైశ్యసభ పట్టణ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన్‌రావు ధన్యవాదాలు తెలిపారు. జమ్మలమడుగు, బద్వేలు, మైదుకూరు నియోజకవర్గ మండలాల్లోని ఆలయాల్లో దసరా సంబరాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవార్ల గ్రామత్సవం ఘనంగా చేపట్టారు. -న్యూస్‌టుడే, క్లస్టరు బృందం

గాల్లో పంచ ప్రాణాలు!



రహదారి నిబంధనలపై పోలీసులు, రవాణా శాఖ అధికారులు.. ఎంత అవగాహన కల్పించినా పట్టించుకోవడం లేదు. జమ్మలమడుగు - తాడిపత్రి ప్రధాన రహదారిలో ద్విచక్రవాహనంపై ఐదుగురు ప్రమాదకరంగా ప్రయాణిస్తూ 'న్యూస్‌టుడే' కంట పడ్డారు. ప్రమాదకరమైన సంఘటనలు జరగకుండా ముందుగా జాగ్రత్తపడాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. -న్యూస్‌టుడే, జమ్మలమడుగు గ్రామీణ

వృద్ధాప్యం రెండో బాల్యం పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న రచయిత ప్రభాకర్, ఎన్జీవో పట్టణ అధ్యక్షుడు రఘురామిరెడ్డి తదితరులు

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: వృద్ధాప్యంలో ఒంటరితనం శాపమని వృద్ధులకు అండగా నిలిచేందుకు ఒక హెల్ప్‌లైన్ అవసరమని ఏపీ అసెంబ్లీ ఓఎస్డీ డాక్టర్ ఎం.ప్రభాకర్ అన్నారు. స్థానిక ఎన్జీవో అసోసియేషన్ కార్యాలయంలో విజయదశమి రోజున 'వృద్ధాప్యం రెండో బాల్యం' అనే పుస్తకాన్ని రచయిత ఎం.ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత మాట్లాడుతూ వృద్ధులకు ప్రత్యేక ఆశ్రమాలను ప్రభుత్వం నిర్మించాలన్నారు. ప్రత్యేక హెల్ప్‌లైన్ అవసరమన్నారు. వృద్ధాప్యంలో ఆరోగ్యంగా ఉండడం ఎంత అవసరమన్నారు. అందరం వారికి అండగా ఉండాలన్నారు. ఈ పుస్తక ప్రచురణకు వ్యాపారవేత్త సి.వి.సుబ్బారావు సహకరించారన్నారు. ఎన్జీవో పట్టణ అధ్యక్షుడు కె.జె.రఘురామిరెడ్డి, ఎన్.ఈశ్వర్‌రెడ్డి, పెన్షన్‌దారుల సంఘ సలహాదారుడు ఎం.రామసుబ్బారెడ్డి, వి.సుధాకర్, పెంచలయ్య, రెడ్డిన్న, కవులు, కళాకారులు, రచయితలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భాషోపాధ్యాయ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొద్దుటూరుకు చెందిన అంకాల్ కొండయ్య అన్నారు. శనివారం రాత్రి అంతర్జాలంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలో ఆయనను ఫోర్త్ సెక్రటరీ జనరల్‌గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందించారు.

ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేయొద్దు



మాట్లాడుతున్న సంగమేశ్వరరెడ్డి వేదికపై సంఘం నాయకులు

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: సంస్కరణల పేరుతో ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేయవద్దని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వరెడ్డి అన్నారు. ఎస్టీయూ కార్యాలయంలో రీజనల్ కన్వీనర్ కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ ను అమలు చేయాలని కోరారు. నాయకులు శివారెడ్డి, పుల్లారెడ్డి, రంగారెడ్డి పాల్గొన్నారు.

అదనపు వసూళ్లు... అడ్డుకునే వారేవరు?

ఎగ్జిబిషన్ నిర్వహణలో పుర ఖజానాకు గండి

-న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం



ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్

ప్రొద్దుటూరు పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్ గుత్తేదారు నిర్వాహకులు నిబంధనలను అమలు చేయ లేదు. ప్రతిఫలంగా అటు ప్రజలపై భారం పడింది. పుర ఖజానాకు ఆదాయపరంగా గండి పడింది. దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏటా ట్రేడ్ ఫెయిర్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. జీఎస్టీతోసహా రూ.2.06 కోట్లకు పాటను దక్కించుకుని ఈ నగదు పుర ఖజానాకు చెల్లించక ఆదాయాన్ని దెబ్బతీస్తున్నారు. పాటలో కనీసం సగం నిధులు చెల్లించకున్నా ఓ అధికారి నిరభ్యంతర పత్రం (ఎన్వోసీ) అందజేయడం గమనార్హం. పుర పాలక సంఘం నియమం ప్రకారం ప్రవేశ రుసుం పెద్దలకు రూ.25, చిన్నారులకు రూ.15ల టికెట్ ధరను కేటాయించగా రూ.5లను అధికంగా వసూలు చేయడంపై విమర్శలు వచ్చాయి. జెయింట్ వీల్ తదితర వినోద వస్తువులపై ఒక్కో టిక్కెట్టుపై అదనంగా రూ.20 వసూలు చేశారు. జైంట్‌వీల్ ఇతర వినోద వస్తువులకు నిర్దేశించిన ధరకన్నా ఒక్కోవాటిపై రూ.20లను అధికంగా వసూలు చేశారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా రూ.100 అదనంగా వెచ్చించాల్సి వచ్చిందని అన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా గుత్తేదారు వ్యవహరిస్తున్నా పురపాలక సంఘం అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. నిర్వాహకుల్లో కొందరు ప్రజాప్రతినిధి అనుయాయులు ఉండడంతో పుర అధికారులు ఆచితూచి అడుగులేస్తున్నారు. 2011 నుంచి పురపాలక సంఘం ఇప్పటివరకు ఎగ్జిబిషన్ ఎనిమిది సార్లు నిర్వహించింది. ఎవరుకూడా పాడిన నగదుకు అనుగుణంగా నిధులను చెల్లించింది లేదు. ఈ విషయమై పురపాలక సంఘం కమిషనర్ వి.మల్లికార్జునను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ప్రవేశ రుసుం అదనంగా వసూళ్లు చేసినందుకు గుత్తేదారుకు నోటీసులు జారీ చేశామన్నారు. నిబంధనల మేరకే టిక్కెట్టు ధరను వసూలు చేయాలన్నారు. పుర ఖజానాకు పూర్తి స్థాయిలో సకాలంలో నిధులు చెల్లించకపోతే ఎగ్జిబిషన్‌ను నిలుపుదల చేయిస్తామన్నారు. ఒక్క రూపాయి కూడా పుర ఖజానాకు నష్టం వాటిల్లకుండా చర్యలు చేపడతామన్నారు.

కడప

• కడప • పులివెందుల • కమలాపురం


గురువులతో పూర్వ విద్యార్థులు

అపూర్వ కలయిక

లింగాల, న్యూస్‌టుడే : వెలిదండ్ల ఉన్నత పాఠశాలలో 2004-2005లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలుసుకున్నారు. 20 ఏళ్ల తర్వాత వారంతా ఒక్క చోటుకు చేరి అప్పటి జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు జాన్సీలక్ష్మీబాయి, కృష్ణారెడ్డి, వీరేంద్రరావు, సంఘిరెడ్డి, వీరనాగిరెడ్డిలను ఘనంగా సన్మానించారు. పాఠశాలకు ఏ అవసరం ఉన్నా మేమున్నామని భరోసా కల్పించారు.

శిల్పారామంలో సందడి

మారుతీనగర్, న్యూస్‌టుడే: శిల్పారామంలోని కళా వేదికపై ఆదివారం దసరా మహోత్సవాలు ముగింపు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మిస్పా మూవీ ఆధ్వర్యంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. చిన్నారులు, యువత వివిధ పాటలకు నృత్యాలతో అలరించాయి. నగరవాసులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. శిల్పారామం పరిపాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


నృత్యం చేస్తున్న కళా బృందం

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
కడప: 8008573428, 8074174832
పులివెందుల : 8008573466
కమలాపురం : 8008573475

స్పందనకు వందనం

కమలాపురం పోలీస్ లైన్ వీధికి వెళ్లే దారిలో రోడ్డు పక్కన చెత్త తొట్టి నిండి దుర్వాసన వ్యాపిస్తోందని 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలనరసింహులు స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులను పంపించి చెత్తను తొలగించి శుభ్రం చేయించారు. **- న్యూస్‌టుడే, కమలాపురం**

?: కడప బుగ్గవంక ప్రహరీ పక్కనున్న మురుగు కాలువలో వ్యర్థాలు పేరుకుపోయి ప్రవాహం ముందుకు కదలడం లేదు. **- మహమ్మద్‌రఫీ, రవీంద్రనగర్, కడప**

✓: మురుగు కాలువలో ఉన్న చెత్తాచెదారాన్ని నగరపాలక సిబ్బంది ద్వారా తొలగించే చర్యలు తీసుకుంటాం. **- చంద్రశేఖర్, వైద్యాధికారి, నగరపాలక, కడప - న్యూస్‌టుడే, చిన్నచౌకు**

?: నాగరాజుపేటలోని కేవీఎస్‌ఆర్ ఆసుపత్రి పక్క సందులో గత వారం రోజులుగా కుళాయిలకు నీళ్లు రావడం లేదు. చాలా ఇబ్బంది పడుతున్నాం. **- పద్మ, స్థానికురాలు**

✓: ప్రస్తుతం ఈ ప్రాంతానికి నీళ్లు రోజుమార్చి రోజు వదులుతున్నాం. అక్కడ నీళ్లు రాకపోవడంపై పరిశీలించి సరి చేస్తాం. **- నరసింహ, ఫిట్టర్ - న్యూస్‌టుడే, మారుతీనగర్**

?: కమలాపురం ఎంపీడీవో కాలనీలో రోడ్డు పక్కన చెత్త తొట్టి నిండి కిందపడి పోయి దుర్వాసన వస్తోంది. అధికారులు చర్యలు తీసుకోవాలి. **- నాగేశ్, స్థానికుడు, కమలాపురం**

✓: వెంటనే ఆ ప్రాంతానికి పారిశుద్ధ్య కార్మికులను పంపి చెత్తను తొలగించే ఏర్పాట్లు చేస్తాం. సమస్య పరిష్కరిస్తాం. **- బాల నరసింహులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ - న్యూస్‌టుడే, కమలాపురం**

కంపు కొడుతున్న నగరం

అధ్వాన పారిశుద్ధ్యంతో ప్రజల అవస్థలు


ఆర్టీసీ బస్టాండు ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారం

- న్యూస్‌టుడే, కడప చిన్నచౌకు

కడప నగరంలోని పలు కాలనీల్లో సమస్యలు తిష్టవేశాయి. ఎక్కడ చూసినా చెత్తాచెదారం, మురుగునీరు, దోమలతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో కనీస మౌలిక వసతులు కరవయ్యాయి. గత కొంత కాలం నుంచి నగరంలో చెత్త సమస్య ఎక్కువగా ఉంది. నాలుగైదు రోజులకొకసారి కూడా వాహనం రాకపోవడంతో నివాసాల్లో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఎక్కువ రోజులు నిల్వ ఉండడంతో దుర్వాసనతో పాటు దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో పలువురు వ్యాధులపాలవుతున్నారు.

ఆజాద్‌నగర్ వాసుల అవస్థలు : కడప శివారులోని ఆజాద్‌నగర్ ప్రధాన దారి పక్కనే చెత్తాచెదారం పేరుకుపోయింది. పైగా అక్కడ పందుల సంచారం ఎక్కువగా ఉంది. వ్యర్థాలను అవి చెల్లాచెదురు చేయడంతో అదంతా నివాసాల్లోకి వస్తోంది. వరాహాలు ప్రజలపై దాడులు చేస్తున్నాయి. సకాలంలో చెత్తను తరలించకపోవడంతో ఈ సమస్య ఉత్పన్నమవుతోందని స్థానికులంటున్నారు. నివాసాల ఎదుట ఉన్న ఖాళీ ప్రదేశాల్లో గత కొద్ది రోజుల నుంచి నీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెందుతున్నాయి. సాయంత్రం బయటకు రావాలంటే ప్రజలు భయపడాల్సిన పరిస్థితి.

అపరిశుభ్రతకు నిలయం

కడప ఆర్టీసీ బస్టాండు అపరిశుభ్రతకు నిలయంగా మారింది. ఇక్కడ ప్రతి రోజూ వందల మంది రాకపోకలు సాగిస్తుంటారు. అలాంటి ప్రాంతంలో చెత్త పేరుకుపోయింది. దుర్వాసనతో ప్రయాణికులు ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తుంది. అధికారులు, సంబంధిత కాంట్రాక్టరు పట్టించుకోకపోవడంతో సమస్య ఉత్పన్నమైంది. బస్టాండు ఆవరణలో పాత ఎగ్జిబిషన్ సామగ్రి ఉన్న చోట మురుగునీటితో నిండిపోయి, దోమలకు నిలయంగా మారింది. దీనిపై ఎంహెచ్‌వో చంద్రశేఖర్ మాట్లాడుతూ చెత్త తొలగింపునకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు.


ఆజాద్‌నగర్‌లోని నివాసాల వద్ద మురుగు నిల్వ

* కడపలోని శ్రీకృష్ణదేవరాయల కాలనీలో కాలువలు సక్రమంగా లేకపోవడంతో మురుగంతా రోడ్లపై ప్రవహిస్తోంది. ప్రకాష్‌నగర్‌లో కూడా ఇదే పరిస్థితి ఏర్పడింది. పలు చోట్ల భూగర్భడ్రైనేజీ లీకై రాకపోకలకు పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పారిశుద్ధ్య సమస్యపై దృష్టిసారించి, పరిష్కారానికి చర్యలు చేపట్టాలని నగరవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

చెత్త వాహనాలు రావడం లేదు



నగరంలో చెత్త వాహనాలు సక్రమంగా రావడం లేదు. వీధుల్లో చెత్తను తొలగించడం లేదు. గతంలో రెండు రోజుల కొకసారి తీసుకెళ్లేవారు. ఇప్పుడు వారానికొకసారి కూడా రావడం లేదు. దీంతో చాలా ఇబ్బందికరంగా ఉంది. అధికారులు స్పందించడం లేదు. **- విమల, బాలాజీనగర్, కడప**

ట్రిపుల్‌ఐటీ అధ్యాపకుడికి జాతీయ ప్రతిభా అవార్డు



వేంపల్లె, న్యూస్‌టుడే : ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ అధ్యాపకుడు **డా.విరూపాక్షి ప్రభాకర్**కు ఏపీజే అబ్దుల్‌కలాం జాతీయ ప్రతిభా అవార్డు లభించింది. పులివెందులకు చెందిన ఆయన ట్రిపుల్‌ఐటీలో ఎనిమిదేళ్లుగా కెమిస్ట్రీ విభాగం సహాయ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ విద్యార్థులు చదువుల్లో రాణించేలా కృషి చేస్తున్న ఆయనకు ఈ నెల 20న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ప్రతిభా అవార్డు ప్రదానం చేయనున్నారు. ఆయనకు అవార్డు రావడంపై అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా అంజన్న గ్రామోత్సవం

చక్రాయపేట, న్యూస్‌టుడే : గండి క్షేత్రంలో దసరా పండుగ సందర్భంగా స్వామివారికి ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఊరేగింపులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు కేసరి స్వాములు ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. ఊరేగింపు గండిక్షేత్రం నుంచి వీరన్న గట్టుపల్లె వరకు కొనసాగింది.


వీరాంజనేయస్వామి

అందరినీ ఆకట్టుకునేలా పొట్టేలు సినిమా

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: పొట్టేలు సినిమా అన్ని వర్గాలను ఆకట్టుకునేలా తీశామని హీరో యువచంద్రకృష్ణ పేర్కొన్నారు. సినిమా ప్రచారంలో భాగంగా ఆదివారం కడపలో ఆయన మాట్లాడుతూ పూర్తిగా గ్రామీణ నేపథ్యంలో సినిమా సాగుతుందని, ఇది ఆడ బిడ్డ చదువు కోసం తండ్రి పడే కష్టాల నేపథ్యంలో ఉంటుందన్నారు. అనన్య నాగళ్ల హీరోయిన్‌గా నటించిందని చెప్పారు. ఈ నెల 25న విడుదలయ్యే సినిమాను ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. అనంతరం చిత్ర పోస్టర్లను ఆవిష్కరించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు పుట్టిన రోజు వేడుకలు ఆ పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం కడప జిల్లా పరిషత్ ప్రాంగణంలోని ప్రేమాలయ వృద్ధాశ్రమంలో పేదలకు అమీర్‌బాబు అన్నదానం చేశారు. తొలుత కేక్‌కట్ చేశారు. నాయకులు ఆమూరిబాలదాసు, నాసర్‌అలీ, వెంకటేశ్‌యాదవ్, డాక్టర్ నజీముద్దీన్, కొండాసుబ్బయ్య, అఫ్సర్‌అలీఖాన్, రెహ్మాన్, వరకుమార్, రామలక్షుమ్మ, స్వర్ణలత, చీకటి చార్లెస్ పాల్గొన్నారు.

అంధకారంలో ఏటీఎం కేంద్రం



పులివెందుల పట్టణం పాతగంగిరెడ్డి ఆసుపత్రి సమీపంలోని ఎస్బీఐ ఏటీఎం కేంద్రం మూడు నెలలుగా అంధకారంలో ఉండటంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కేంద్రంలో విద్యుత్తు సరఫరా లేకపోవడంతో ఖాతాదారులు చరవాణి లైట్ల వెలుగులో నగదు తీసుకుంటున్నారు. కేంద్రం మొత్తం చెత్తాచెదారంతో అధ్వాన్నంగా మారడంతో అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై బ్యాంకు అధికారిని వివరణ కోరగా వెంటనే ఏటీఎం కేంద్రంలో విద్యుత్తు సౌకర్యం కల్పిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, పులివెందుల (వేంపల్లె)**

చిత్రావతి చిన్నెలు... కృష్ణమ్మ రంగులు



పెంచికల బసిరెడ్డి జలాశయం(పీబీఆర్) రెండు వర్ణాల నీటితో పర్యాటకులను కట్టిపడేస్తోంది. గండికోట ఎత్తిపోతల పథకాల ద్వారా ఆగస్టు 20 నుంచి 3 మోటార్ల ద్వారా 1400 క్యూసెక్కుల మేర కృష్ణా జలాలను తరలిస్తున్నారు. గండికోట నుంచి వచ్చిన జలాలు ఎర్రని నీటితో, జలాశయంలో ఉన్న పాత నీరు ముదురు నీలం రంగులో కనిపిస్తోంది. ఏకకాలంలో జలాశయ సగభాగం ఎర్ర నీరు, మరో సగభాగం ముదురు నీలం రంగులో కనిపిస్తుండటంతో జలాశయంలోకి బోటు షికారుకి వెళ్లిన కడప, అనంతపురం జిల్లాల పర్యాటకులు స్వీయచిత్రాలు తీసుకుంటున్నారు. **- న్యూస్‌టుడే లింగాల**

గుంత.. రాకపోకలకు చింత

కడప జడ్పీ కార్యాలయ సమీపంలోని మూడురోడ్ల కూడలి వద్ద రోడ్డుపై గుంతలు పడ్డాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో గుంతలు కనిపించక పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. జడ్పీ అధికారులు ప్రతిరోజూ ఈ రోడ్డుపై నుంచి వెళ్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కడప చిన్నచౌకు**



ధరల నియంత్రణపై దృష్టి సారించాలి

పులివెందుల (వేంపల్లె) న్యూస్‌టుడే : నిత్యావసరాల ధరల నియంత్రణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్య ప్రతినిధి తులసిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. పండుగలపూట ప్రజలు పస్తులు ఉండాల్సిన దుస్థితి నెలకొందన్నారు. వంటనూనెలు, కందిపప్పు, ఎండుమిర్చి, చింతపండు ధరలు భారీగా పెరిగాయన్నారు.

బంగారు నగల అపహరణ

కదిరి పట్టణం, న్యూస్‌టుడే : కదిరి ఆర్టీసీ బస్టాండులో రద్దీగా ఉండే సమయంలో తన బ్యాగులోని బంగారు నగలు అపహరణకు గురైనట్లు కడప జిల్లా వేంపల్లికి చెందిన స్వాతి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేంపల్లి మండలం పిరమిడ్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఆమె దసరా సెలవులకు కుటుంబ సభ్యులతో కలిసి కర్ణాటకకు వెళ్లారు. రెండు రోజుల కిందట తిరుగు ప్రయాణంలో కదిరి ఆర్టీసీ బస్టాండులో హ్యాండ్ బ్యాగులోని 70 గ్రాముల బంగారు నగలు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి చెప్పారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఆటో

కడప, నేరవార్తలు : రాజంపేట నుంచి కడపకు వస్తున్న ఆటో అదుపుతప్పి కేంద్రకారాగారం వద్ద రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొంది. ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని వెంటనే అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.

బస్సు నుంచి జారి పడి వ్యక్తికి గాయాలు

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : ఆర్టీసీ బస్సు నుంచి ఓ వ్యక్తి కింద పడి గాయపడిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. వేంపల్లికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు సీకే దిన్నె మండల పరిధిలో కృష్ణాపురం సమీపంలోకి రాగానే డోరు వద్ద నుంచున్న వ్యక్తి ప్రమాదవశాత్తూ కింద పడి గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం స్థానికులు అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.

చెరువులకు నీటి మళ్లింపు


నీటికి అడ్డుగా మట్టి పోస్తున్న జేసీబీ

కమలాపురం, న్యూస్‌టుడే : ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డిల ఆదేశాల మేరకు ఆ పార్టీ సీనియర్ నాయకుడు లోమడ వాసుదేవరెడ్డి, ఎర్రబల్లె సుబ్బారెడ్డిలు కమలాపురం, చదిపిరాళ్ల చెరువులకు నీటిని మళ్లించే పనులు చేపట్టారు. మండలంలోని లేటపల్లె వద్ద ఆదివారం పాపఘ్ని నదిలో జేసీబీలతో ఇసుక తవ్వించి అడ్డుగా కట్టలు వేయించి కట్టుకొమ్మకాలువ ద్వారా చెరువులకు నీరు మళ్లించారు.

వైకాపా పాపం... పులివెందుల వాసులకు శాపం

● అసంపూర్తిగా అభివృద్ధి పనులు
● ఆందోళనలో పుర ప్రజలు

పులివెందుల (వేముల), న్యూస్‌టుడే : గత వైకాపా ప్రభుత్వ అలసత్వం, అధికారుల నిర్లక్ష్యం పులివెందుల ప్రజలకు శాపంగా మారింది. పులివెందుల పట్టణాభివృద్ధిలో భాగంగా గత వైకాపా ప్రభుత్వం చేపట్టిన పనులు నిధులలేమితో ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో పట్టణంలో సమస్యలు తిష్టవేశాయి. దీంతో ప్రయాణికులు, పురప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని భాకరాపురం వీధిలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోవడంతో రాకపోకలకు స్థానికులు అవస్థలు పడుతున్నారు. సార్వత్రిక ఎన్నికలకు మూడు నెలల ముందు పనులు దక్కించుకున్న గుత్తేదారులు పూర్తి చేసిన పనులకు బిల్లులు మంజూరు కాలేదు. సుమారు రూ.50 లక్షల పాడా నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణాలను అరకొరగా చేసి ఎన్నికలు సమీపించడంతో వదిలేశారు. కంకరపరిచి వదిలేయడంతో ప్రస్తుతం ఈ మార్గం అస్తవ్యస్తంగా మారింది. ఈ మార్గంలో వెళ్లేందుకు ద్విచక్రవాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పులివెందుల పురపాలకలో రూ.వంద కోట్ల వ్యయంతో భూగర్భ మురుగుకాలువల నిర్మాణాల్లో భాగంగా పట్టణంలోని తూర్పు ఆంజనేయస్వామి ఆలయం మీదుగా చేపట్టిన పనులు గుంతలు తవ్వి వదిలేశారు. నెలలు గడుస్తున్నా ఇక్కడ చేపట్టిన పనులు ఎక్కడవేసిన గొంగళి అనే చందంగా మారిపోయింది. ఫలితంగా ప్రస్తుతం ఈ మార్గం ప్రమాదకరంగా మారింది. వర్షం కురిస్తే గుంతల్లో నీరు నిలిచి పరిసర ప్రాంతాల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ రాముడును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా పాడా రద్దుకావడంతో నిధుల సమస్య ఏర్పడిందన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుకాగానే పనులు పూర్తి చేస్తామన్నారు.


భాకరాపురంలో కంకరపరచి వదిలేశారిలా...

శ్రీకృష్ణ డెంటల్‌కేర్ ఆసుపత్రి ప్రారంభం

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: కడప రైల్వేస్టేషన్‌రోడ్డులోని సీఎస్ఐ గ్రౌండ్ ఎదురుగా నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ డెంటల్ కేర్ ఆసుపత్రిని డాక్టర్ బ్రిజేష్‌కృష్ణ తల్లి దండ్రులు అనసూయ, రాజగోపాలయ్యలు ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి, జనసేన సలహాదారు పీవీఎస్ మూర్తి హాజరయ్యారు. ఈసందర్భంగా డాక్టర్ బ్రిజేష్‌కృష్ణ మాట్లాడుతూ అత్యాధునిక వైద్య పరికరాలతో ఆసుపత్రి ఏర్పాటు చేశామని చెప్పారు. తెదేపా నేతలు అమీర్‌బాబు, హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి, వైకాపా నాయకుడు సుభాన్‌బాషా, బలిజ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపిశెట్టి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


ఆసుపత్రిని ప్రారంభిస్తున్న అనసూయమ్మ, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి, డాక్టర్ బ్రిజేష్ కృష్ణ, తెదేపా నేతలు

మంత్రిని కలిసిన తెదేపా నాయకులు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: రాష్ట్ర రవాణా, క్రీడల శాఖ మంత్రి మండపల్లి రాంప్రసాద్‌రెడ్డిని నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో మండల తెదేపా నాయకులు ఆదివారం కలిసి అభివృద్ధి పనులపై చర్చించారు. అమాత్యుడిని కల్లుగీత కార్మికుల సహకార ఆర్థిక సంస్థ మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య ఆధ్వర్యంలో కలిసి శ్రీరామ ఎత్తిపోతల పథకం వార్షిక నిర్వహణ, కొత్త పైపులైను ఏర్పాటు చేయడానికి అవసరమైన నిధులు మంజూరు చేయించాలని విజ్ఞప్తిచేశారు. శివకుమార్, నరసింహులు, శ్రీహరి, ఆదినారాయణ, రమణ, రామకృష్ణయ్య, రమణారెడ్డి, వెంకటేష్, మధుసూదన్, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యంలో సంచలనం బంగోరె

ఎన్‌జీవో కాలనీ (కడప), న్యూస్‌టుడే: రచయితగా, పరిశోధకునిగా, విమర్శకునిగా, జర్నలిస్టుగా బండి గోపాలరెడ్డి (బంగోరె) తెలుగు సాహిత్య పరిశోధన రంగంలో చరిత్ర సృష్టించారని జిల్లా రచయిత సంఘం అధ్యక్షుడు మూల మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. బంగోరె జయంతి సందర్భంగా సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని కడప రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో శనివారం బంగోరె చిత్రపటానికి పూలమాల సమర్పించి ఘన నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సీపీ బ్రౌన్‌కు సంబంధించిన అనేక అంశాలను వెలుగులోకి తెచ్చారన్నారు. కవి వెల్లాల వెంకటేశ్వరాచారి, బాల యల్లారెడ్డి, సత్యనారాయణ, రెడ్డయ్య, బాలఓబయ్య తదతరులు పాల్గొన్నారు.


బంగోరె చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రచయితల సంఘం ప్రతినిధులు, సభ్యులు

వేతనాలు రాక అవస్థలు

మారుతీనగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఆయాలు, వాచ్‌మెన్‌లకు విద్యా సంవత్సరం ప్రారంభం అయిన నాటి నుంచి నేటి వరకు నాలుగు నెలలుగా వేతనాలు అందలేదని, దసరాకు ఒక్క నెల వేతనమైనా వస్తుందని నిరీక్షించిన వారికి పండుగ పూటా పస్తులు తప్పలేదని ఏఐటీయూసీ జిల్లా జనరల్ సెక్రటరీ బాదుల్లా ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక జిల్లా కార్యాలయంలో ఆదివారం మాట్లాడుతూ వారికి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రూ.21,000 కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సురెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండు చేశారు.

దసరా ఉత్సవం... మదినిండా సంబరం


సీకేదిన్నెలోని సీఎంఆర్‌పల్లెలో అమ్మవారు


సిద్దవటం మండలం సాయినగర్‌లో మహిళల కోలాట ప్రదర్శన

విజయదశమి ఉత్సవాలు పదిరోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించారు. చివరిరోజు శమీ దర్శనానికి ప్రజలు అమ్మవారి ఆలయాలకు పోటెత్తారు. కడప అమ్మవారిశాల, విజయదుర్గాదేవి, లలితపంచాయతన తదితర ఆలయాల్లో నవరాత్రి వేడుకల్లో ప్రతిరోజుల అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేశారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించి ఊరేగింపులో కేరళ డప్పులు, వివిధ వేషధారణలు ఆకట్టుకున్నాయి. కమలాపురం, పులివెందుల నియోజకవర్గాల్లోనూ వేడుకలు ఘనంగా నిర్వహించారు. **- న్యూస్‌టుడే, బృందం**


నాగరాజుపేటలో అమ్మవారి ఊరేగింపు


నబీకోటలో చౌడమ్మ గ్రామోత్సవం


రవీంద్రనగర్ రామాంజనేయ స్వామి ఆలయంలో...


కమలాపురం: విజయలక్ష్మీ దేవి అలంకారంలో వాసవీమాత


వేములలో విజయలక్ష్మి అలంకరణలో...


గడ్డిబజార్‌లో గ్రామోత్సవంలో భక్తుల సందడి


వేంపల్లె అమ్మవారిశాలలో...


పులివెందులలో వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి దంపతులు


వల్లూరులో అమ్మవారికి పవళింపు సేవ నిర్వహిస్తున్న భక్తులు